RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 15 ISSUE NO : 15 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | బుధవారం, జూలై, 2, 2025 Wednesday, July, 2, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## ట్రంప్ నూతన పౌరసత్వ వ్యవస్థపై సర్వత్రా ఆందోళన..!

వాషింగ్టన్ : ఓటరు పౌరసత్వాన్ని నిర్ధారించుకునేందుకు ఉద్దేశించిన అమెరికా మొదటి జాతీయ డేటాబేస్‌ను ట్రంప్ ప్రభుత్వం రూపొందించింది. దీని పట్ల గోప్యతా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డిహెచ్ఎస్), డోజ్ కలిసి అభివృద్ధిపరిచిన ఈ కొత్త వ్యవస్థ, సామాజిక భద్రతా విభాగం, అమెరికా ఇమ్మిగ్రేషన్ రికార్డుల నుండి వచ్చిన డేటాతో ఓటరు జాబితాలను పరిశీలించుకోవడానికి రాష్ట్ర, కౌంటీ స్థాయి ఎన్నికల అధికారులను అనుమతిస్తుంది. అమెరికా పౌరసత్వం, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యుఎస్‌సిఐఎస్) ఈ కొత్త వ్యవస్థను నిర్వహిస్తుంది.



## ఈనెల 14నుంచి కొత్త...
# రేషన్ కార్డుల పంపిణీ
### తుంగతుర్తిలో ప్రారంభించనున్న సీయం రేవంత్

**హైదరాబాద్,జులై,01,తెలంగాణ దిశ:** తెలంగాణలో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న రేషన్ కార్డు దరఖాస్తుదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఈ నెల 14న సీఎం రేవంత్ రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గంలో కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మొత్తం 2 లక్షలకు పైగా లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు అందజేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు ఇప్పటికే అర్హత పొందిన దరఖాస్తుదారుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. రాష్ట్రంలో చాలా ఏళ్లుగా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రేషన్ కార్డుల జారీ కోసం కేబినెట్ సబ్ కమిటీని ప్రభుత్వం నియమించింది. కొత్త రేషన్ కార్డుల జారీలో అవలంబించాల్సిన విధానం, అర్హతల గురించి సబ్ కమిటీ ఇచ్చిన సూచనలను ప్రభుత్వం ఆమోదించింది. ఆ మేరకు కొత్త కార్డులు, ఉన్న కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లను జత చేసేందుకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. దీంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు అందాయి. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులతో పాటు మీ సేవా కేంద్రాలలో చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వడపోత చేపట్టిన అధికారులు అర్హులైన వారి జాబితాను సిద్ధం చేశారు. దీంతో ఈ నెలలోనే ముఖ్యమంత్రి చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టబోతున్నది ప్రభుత్వం.






## కర్ణాటక సీఎం మార్పుపై ఊహాగానాలకు చెక్..!

**బెంగళూరు,జులై,01:** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రి పీఠంపై డీకే శివకుమార్, సీఎం సిద్ధరామయ్య ఇద్దరూ చెరో రెండున్నరేళ్లుఉంటారని సమాచారం. ఈ క్రమంలో మరో రెండు, మూడు నెలల్లో సీఎం మార్పు ఉంటుందంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారానికి కాంగ్రెస్ ఇన్‌చార్జి,ఆపార్టీ జనరల్ సెక్రటరీ రణ్‌దీప్ సింగ్ సుర్జేవాలాచెక్ పెట్టారు. అలాంటి కసరత్తు ఏమీ జరగడం లేదని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఆయన మద్దతుదారులు బహిరంగంగానే పిలుపునిస్తున్నారు. సుమారు 100 మంది ఎమ్మెల్యేలు డీకేకు మద్దతిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్బాల్ హుస్సేన్ మంగళవారం పేర్కొన్నవిషయం తెలిసిందే. 'నేనఒక్కడినికాదు.. మెజారిటీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి మార్పు కోరుకుంటున్నారు. 100 మందికిపైగా ఎమ్మెల్యేలు డీకేశివకుమార్‌కుమద్దతు ఇస్తున్నారు. వారిలో చాలా మంది మార్పు కోసం ఎదరుచూస్తున్నారు. మంచి పాలన కోరుకుంటున్నారు. సిద్ధరామయ్యను తొలగించి..డీకే శివకుమార్‌ను సీఎంని చేయాలి.

## కాళేశ్వరం - కూలేశ్వరంగా మారింది : సీతక్క



**నిజామాబాద్,జులై,01,తెలంగాణ దిశ:** బిఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన మూడేళ్లకే కాళేశ్వరం కూలేశ్వరంగా మారిందని ఇంఛార్జ్ మంత్రి సీతక్క ఎద్దేవా చేశారు. మంగళవారం నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ ఉమ్మడి జిల్లాల కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని నాశనం చేసిందని దుయ్య బట్టారు. 2014 తెలంగాణ నూతన రాష్ట్రం ఏర్పడిన తర్వాత బిఆర్ఎస్ పార్టీ నిధులు, నియామకాలు అని చెప్పి నిధులన్నింటిని కెసిఆర్ కుటుంబసభ్యులు నీళ్లన్నీ ఫాంహౌస్ లోకి తరలించారని ఆరోపించారు. వరి వేస్తే రైతులకు ఉరి పడ్డట్టేనని అన్నారని, కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పండించిన రైతులకు రూ 500 బోనస్ ఇస్తుందని ప్రశంసించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలోని పేద ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం అందిస్తుందని, అలాగే 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇళ్లకు కరెంట్ ఇస్తోందని కొనియాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేవలం పదేళ్లలో కేవలం 60 వేల ఇళ్లు మాత్రమే మంజూరు చేసిందని, అందులో సగానికి పైగా బిల్లులు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, సంక్షేమ పథకాలన్నీ ప్రజల్లోకి వెళ్లే విధంగా ప్రతికార్యకర్త కృషి చేయాలని సూచించారు.

## పాశమైలారం ప్రమాద ఘటనను సుమోటోగా స్వీకరించిన హెచ్ఆర్సీ



**హైదరాబాద్,జులై,01,తెలంగాణ దిశ:** పాశమైలారంపేలుడు ఘటనపై నేషనల్ హుమన్ రైట్స్ కమిషన్ కి పిర్యాదు చేశారు. సిగాచి పరిశ్రమ డైరెక్టర్ల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని రామారావు అనే వ్యక్తి ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షలు,గాయపడ్డ వారికి రూ. 10 లక్షల నష్టపరిహారం ఇప్పించాలని రామారావు అందులో తెలిపారు. అలాగే తెలంగాణలోని అన్ని పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని ఫిర్యాదు దారుడు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ పాశమైలారం ప్రమాద ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా తీసుకుంది. జూలై 30లోగా ప్రమాద ఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్, లేబర్ కమిషనర్, ఫైర్ డీజీ, సంగారెడ్డి ఎస్పీకి ఆదేశాలు జారీ అయ్యాయి. మరోవైపు ఘటనపై న్యాయవాది కుమారస్వామి హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేశారు. ఓల్డ్ మిషనరీ వాడకం, అధికారులు చూసి చూడనటువంటి తీరు వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, సిగాచి కెమికల్ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


## కార్యకర్తల బలంతో వచ్చే ఎన్నికల్లో..
# అధికారం చేపడతాం

**బిజెపిపై విమర్శలు చేస్తున్న వారికి సమాధానం చెప్పాల్సిన పనిలేదు : కిషన్ రెడ్డి**



**హైదరాబాద్,జులై,01,తెలంగాణ దిశ:** బీజేపీపై విమర్శలు చేస్తున్న వారికి జవాబు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్ రెడ్డి అన్నారు. బీజేపీ-బీఆర్ఎస్ కుమ్మక్కయ్యారని కాంగ్రెస్ అంటుంటే, కాంగ్రెస్- బీఆర్ఎస్ కుమ్మక్కు అయిందని బీఆర్ఎస్ ప్రతిరోజు విమర్శలు చేస్తున్నారు. కానీ తమకు ఎవరితోనూ కుమ్మక్కు అయ్యే అవసరం లేదన్నారు. తాము కుమ్మక్కు అయ్యేది తెలంగాణ ప్రజలతో మాత్రమేనన్నారు. తెలంగాణ బీజేపీకి కొత్త అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది, ఏబీవీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావుఎంపికయ్యారు. బీజేపీ సంస్థాగత ఎన్నికల అధికారి, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ఆయన ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. మన్నెగూడ లో జరిగిన సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. వేదిక వద్ద ర్యాలీగా వచ్చిన నూతన అధ్యక్షుడికి ఘన స్వాగతం లభించింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో పాటు బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రామచందర్ రావుకు శుభాకాంక్షలు తెలుపుతూ, పార్టీ విజయాలను మరింత పటిష్ఠం చేస్తారన్న ఆశాభావం వ్యక్తమైంది. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి,రాహుల్ గాంధీ, కేసీఆర్ఎవరి దయాదాక్షిణ్యాలతో తాము గెలవలేదన్నారు. ముందుకు వెళ్తామన్నారు. బీజేపీపై అర్థం పర్థం లేకుండా రన్నింగ్ కామెంట్స్ చేస్తున్న సన్నాసులకు సమాధానం చెప్పాల్సిన అవసరం మాకు లేదని, సమాధానం చెప్పుకునే అవసరం ఎవరికైనా ఉంది అంటే అది నా తెలంగాణ ప్రజలకు మాత్రమేనన్నారు.

## తెరుచుకున్న బాబ్లీ గేట్లు..
# రైతులు, మత్స్యకారుల హర్షం



**ముంబయి,జులై,01:** మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య కీలకమైన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మంగళవారం అధికారులు ఎత్తారు. సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను అనుసరించి, ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా జులై 1న గేట్లను తెరిచారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ సమీపంలో గోదావరి నదిపై నిర్మించిన ఈ ప్రాజెక్టుకు ఉన్న 14 గేట్లను కేంద్రజల సంఘం (సీడబ్ల్యూసీ) అధికారుల పర్యవేక్షణలో ఇరు రాష్ట్రాల ఇంజనీర్లు పైకి లేపారు. దీంతో గోదావరి నదిలోకి నీటి ప్రవాహం మొదలైంది. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ప్రకారం ఏటా జులై 1 నుంచి అక్టోబర్ 28 వరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను పూర్తిగా తెరిచి ఉంచాల్సి ఉంటుంది. ఈ కాలంలో ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయకుండా, గోదావరి నది సహజ ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలి. ఈ నిబంధనను అనుసరిస్తూ మంగళవారం ఉదయం అధి కారులు గేట్లను ఎత్తారు. ప్రస్తుతం ప్రాజె క్టులో నీటిమట్టం 1,064 అడుగుల వద్ద ఉందని అధికారులు వెల్లడించారు. బాబ్లీ గేట్లు తెరుచుకోవడంతో దిగువన ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఆయకట్టు రైతులతో పాటు గోదావరి నదిపై ఆధారపడి జీవించే మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే వరద నీరు నేరుగా దిగువకు చేరనుండటంతో తమకు ప్రయోజనం కలుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




## టేకాఫ్ అయిన కొన్ని నిమిషాలకే ఎయిర్ ఇండియా విమానంలో కలకలం..!

**న్యూఢిల్లీ,జులై,01:** మరోఎయిర్ ఇండియా విమానం కలకలం రేపింది. ఢిల్లీ నుంచి వియన్నాకు బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కొంతసేపటికే కిందకు దిగి 900 అడుగుల ఎత్తుకు చేరి కలవరం సృష్టించింది. వెంటనే పైలట్‌లు పరిస్థితిని చక్కదిద్దడంతో యథా ప్రకారం విమానం గమ్యస్థానానికి చేరింది. జూన్ 14న ఈ ఘటన జరిగిందని ఎయిర్ ఇండియా ప్రతినిధి తాజాగా వెల్లడించారు. అసలేం జరిగిందో తేల్చేందుకు దర్యాప్తు ప్రారంభమైందని చెప్పారు. కారణం తెలిసే వరకూ పైలట్‌లను విధుల రోస్టర్ నుంచి తప్పించినట్టు తెలిపారు.

## హిమాచల్‌లో వర్ష బీభత్సం..
### నలుగురు మృతి, 16 మంది గల్లంతు..!



**మండి :** హిమాచల్‌ప్రదేశ్ , ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్‌జారీ చేసింది. భారీ వర్షాలకు హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో బియాస్ నది ఉప్పొంగిప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తోంది. ఈ వర్షాలకు ఇప్పటి వరకూ మండి జిల్లాలో నలుగురు రణించారు. కనీసం తొమ్మిది మంది వరద ప్రవాహంలో కొట్టుకుపోగా..19 మంది ల్లంతైనట్లు అధికారులు తెలిపారు.ఇక ఇప్పటి వరకూ 99 మందిని రక్షించినట్లు చెప్పారు. ఈవర్షాలకు పది ఇళ్లు,12గోశాలలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు.చండీగఢ్-మనాలీ హైవేలోని మండి-మనాలీ మార్గంలో అనేక చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొండచరియలు విరిగిపడిన కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా మంగళవారం మండిలోని అన్ని విద్యా సంస్థలను అధికారులు మూసివేశారు. కాంగ్రా, సిర్మౌర్, సోలన్ జిల్లాల్లోని పాఠశాలలను కూడా మూసివేశారు. మండి,సిర్మౌర్ జిల్లాల్లోని దాదాపు 250కిపైగా రహదారులను అధికారులు మూసివేశారు. అంతేకాదు 614 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 130 నీటి సరఫరా పథకాలు ప్రభావితమయ్యాయి.

## ప్రముఖ సైకాలజిస్ట్ బీవీ పట్టాభిరామ్ గుండెపోటుతో మృతి..



**హైదరాబాద్,జులై,01,తెలంగాణ దిశ:** ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ తుదిశ్వాస విడిచారు. ఆయనకు గుండెపోటు రావడంతో కన్నుమూశారు. మానసిక వైద్యుడిగానూ పట్టాభిరామ్ ప్రసిద్ధి చెందారు. ఆయనకు భార్య జయ, కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. అయితే, బీవీ పట్టాభిరామ్ భార్య కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలిగా పేరుంది. ఖైరతాబాద్‌లోని స్వగృహంలో ఆయన పార్థివదేహాన్ని ఉంచారు. బుధవారంనాడు ఉదయం 9 గంటల నుంచి అభిమానుల సందర్శనార్థం ఉంచనున్నారు.

# గ్రామ స్థాయి అధ్యక్షుల సమ్మేళనం విజయవంతం చేయాలి

## టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్





**మేడ్చల్ జిల్లా బ్యూరో, జూలై 01, (తెలంగాణ దిశ) :** ఈనెల 4వ తేదీన నగరంలోని లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన కాంగ్రెస్ గ్రామస్థాయి అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపు నిచ్చారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఇంచార్జీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అధ్యక్షతన గాంధీ భవన్ లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 4న జరగనున్న సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ పట్నం సునీత మహేందర్ రెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, జిల్లా పార్టీ పరిశీలకురాలు, బడంగ్ పేట్ మాజీ మేయర్ పారిజాతా రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలను హన్మంత్ రెడ్డి, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పిసరి మహేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ వైద్య దినోత్సవ వేడుకలు

**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్, జూలై 01, (తెలంగాణ దిశ) :**జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి. ఉమాగౌరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ప్రతీ ప్రాణం వెనుక ఓ వైద్యుని సేవ ఉంటుందని, వారి నిస్వార్థ కృషికి మనం ఎల్లప్పుడూ రుణపడి ఉండాలన్నారు. సామాజిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాల్లో సేవలందిస్తున్న వైద్యుల ఖుషి అసమాన్యమన్నారు. డాక్టర్ల నిబద్ధత వల్లే మేడ్చల్ జిల్లాలో ఆరోగ్య రంగం ప్రజలకు మరింత దగ్గరైందన్నారు. అలాగే కోవిడ్ వంటి విపత్కర కాలంలో వారు చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ, అలాంటి సమయంలో వారు ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన తీరు ప్రతి ఒక్కరికి ప్రేరణ అని అన్నారు. డాక్టర్ బీసీ రాయ్ చూపిన సేవా



మార్గం వైద్యులకు ఆదర్శమన్నారు. అటు వంటి ఆచార్యుల వారసులుగా ప్రతి వైద్యుడు సేవలందించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర, మల్కాజిగిరి ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులుగా డాక్టర్ శోభారాణి, డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ గీతా, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ కౌశిక్, డాక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన







**దమ్మాయిగూడ, జూలై 01, (తెలంగాణ దిశ) :**దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని చీర్యాల గ్రామంలో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కాలనీ ప్రజలకు డెంగ్యూ, మలేరియా సీజనల్ వ్యాధులు రాకుండా అవగాహన కల్పించారు. ఇంటింటికీ పొడి, తడి వ్యర్థాల అవగాహన, వీధి, పెంపుడు కుక్కలపై ఎబిసి ప్రచారం, రోజువారి కార్యక్రమాలతో పాటుగా వాణిజ్య లైసెన్స్ లు, ఎస్ హెచ్ జీ ఏర్పాటు సర్వే, ఎస్ హెచ్ జీ ధృవీకరణ, వీధి విక్రేత అవగాహన, భువన్ సర్వే, పబ్లిక్ టాయిలెట్ సందర్శన, భూగర్భ మురికి కాలువలో చెత్త తొలగింపు తదితర కార్యక్రమాలతో పాటు ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి, సానిటరీ ఇన్స్ పెక్టర్ కె. ప్రభు , స్నేహ సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్

## బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు ప్రమాణస్వీకారం





**హైదరాబాద్, జూలై 01, (తెలంగాణ దిశ) :** రంగారెడ్డి జిల్లా మన్నెగూడలోని వేద కన్వెన్షన్ హాల్ లో రంగారెడ్డి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన తెలంగాణ రాష్ట్ర బిజెపి పార్టీ అధ్యక్షుడి ప్రమాణస్వీకారం కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, ఎంపీలు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, డీకే అరుణకుమారి, ఈటల రాజేందర్ ల సమక్షంలో రాష్ట్ర అధ్యక్షుడిగా రామచంద్రరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతో విసిగి వేసారి పోయారని, కేంద్రంలో మోదీ చేస్తున్న సుభాషిత పాలనను ఇటు రాష్ట్రంలోనూ ప్రజలు కోరుకుంటున్నారని ఆ దిశగా పటిష్టమైన కృషి చేసి రాష్ట్రంలో బిజెపి జెండా ఎగరవేస్తానని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయి నుండి బిజెపి పార్టీని బలోపేతం చేస్తానని అన్నారు. ఏడాదిన్నర కాలంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షులు బంగారు లక్ష్మణ్, ఉపాధ్యక్షురాలు కొల్లి మాధవి తదితరులు పాల్గొన్నారు

# వైద్యుల సేవలు వెలకట్టలేనివి..

## కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

**శేరిలింగంపల్లి, జూన్ 01, (తెలంగాణ దిశ) :**తల్లిదండ్రులు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మదర్ సేవ సమితి ట్రస్ట్ ఛైర్మెన్ కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి డివిజన్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని వైద్యులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రాణాలను కాపాడే ప్రత్యక్ష దైవాలు డాక్టర్లని కొనియాడారు. కరోనా కాలంలో వైద్యుల సేవలు త్యాగపూరితమైనవని గుర్తు చేశారు. ప్రజారోగ్యం కోసం తమ కృషి మరింతగా కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాకేష్, డాక్టర్ ఉమాదీపిక, డాక్టర్ జోష్ణ, మదర్ సేవ సమితి ట్రస్ట్ ఛైర్మెన్ బద్దం కొండల్ రెడ్డి, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, కొండల్ రెడ్డి, సుభాష్, మహేష్ చారీ, తుకారాం, పెంటయ్య, గౌతమ్, కృష్ణ, షైబాజ్, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.



# రూల్స్ గీల్స్ జంతేనై..! అంతా నా ఇష్టం..

## రాత్రికి రాత్రి అక్రమ షెడ్ల నిర్మాణాలు

### - పట్టించుకోని దమ్మాయిగూడ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు- తమకున్న అండదండలతో అక్రమ షెడ్ల నిర్మాణాలు






**దమ్మాయిగూడ, జూలై 01, (తెలంగాణ దిశ) :** కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి కీసర ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు ఎదురుగా అక్రమ షెడ్ల నిర్మిస్తున్న పట్టించుకునే వారే లేరని విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలకు దమ్మాయిగూడ మున్సిపాలిటీ కేరాఫ్ అడ్రస్ గా మారింది. నియమ నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా అక్రమ షెడ్ల నిర్మిస్తున్న చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో కీసర ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ ఎదురుగా రాత్రికి రాత్రి అనుమతులకు విరుద్ధంగా అక్రమ షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నరా.. లేక సెలవుల రోజుల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారా..? దీనిపై దమ్మాయిగూడ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. అధికారుల ఉదాసీనత కారణంగా మున్సిపాలిటీకి రావలసిన ఆదాయానికి గండి పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులకు అనేక ఫిర్యాదులు అందుతున్న చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యం ఏమిటిని ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ షెడ్ల నిర్మాణాలపై తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# క్రీడా శాఖలో సమూల మార్పులు

## క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి








**మేడ్చల్ జిల్లా కలెక్టరేట్, జూలై 01, (తెలంగాణ దిశ) :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి. ఉమాగౌరి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ప్రతీ ప్రాణం వెనుక ఓ వైద్యుని సేవ ఉంటుందని, వారి నిస్వార్థ కృషికి మనం ఎల్లప్పుడూ రుణపడి ఉండాలన్నారు. సామాజిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాల్లో సేవలందిస్తున్న వైద్యుల ఖుషి అసమాన్యమన్నారు. డాక్టర్ల నిబద్ధత వల్లే మేడ్చల్ జిల్లాలో ఆరోగ్య రంగం ప్రజలకు మరింత దగ్గరైందన్నారు. అలాగే కోవిడ్ వంటి విపత్కర కాలంలో వారు చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ, అలాంటి సమయంలో వారు ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన తీరు ప్రతి ఒక్కరికి ప్రేరణ అని అన్నారు. డాక్టర్ బీసీ రాయ్ చూపిన సేవా మార్గం వైద్యులకు ఆదర్శమన్నారు. అటు వంటి ఆచార్యుల వారసులుగా ప్రతి వైద్యుడు సేవలందించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర, మల్కాజిగిరి ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులుగా డాక్టర్ శోభారాణి, డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ గీతా, డాక్టర్ చంద్రకళ, డాక్టర్ కౌశిక్, డాక్టర్ వినోద్ పాల్గొన్నారు.

# జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ సముదాయాన్ని స్వాధీనం చేసుకోవాలి

### -నిబంధనల ప్రకారం షాపులను వేలం వేయండి..!!- జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్, కాప్రా డీసీకి ఎస్టేట్ లేఖ



**ఏఎస్ రావునగర్, జూలై 01, (తెలంగాణ దిశ) :** జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ ఏఎస్ రావునగర్ డివిజన్ జై జవాన్ కాలనీలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని జిహెచ్ఎంసి ఎల్ బి నగర్ జోనల్ కమిషనర్, కాప్రా డీసీకి జిహెచ్ఎంసి ఎస్టేట్ విభాగం అడిషనల్ కమిషనర్ లేఖ రాశారు. సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రజా భవన్ లో జరిగిన ప్రజావాణిలో చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. షాపింగ్ కాంప్లెక్స్ లోని 10 మడిగలకు నెలకు సుమారు రూ. 60 వేల ఆదాయం జిహెచ్ఎంసి కోల్పోతుందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన జిహెచ్ఎంసి ఎస్టేట్ విభాగం అడిషనల్ కమిషనర్ తక్షణమే షాపింగ్ కాంప్లెక్స్ స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వ ఉత్తర్వులు 25 ప్రకారం తక్షణమే షాపింగ్ కాంప్లెక్స్ ను స్వాధీనం చేసుకోవడంతోపాటు బహిరంగ వేలం వేయాలని నోటీసులో పేర్కొన్నారు. ఇందుకోసం తక్షణమే జిహెచ్ఎంసి ఎస్టేట్ వింగ్ ను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా తాడూరి గగన్ కుమార్ మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్ స్వాధీనం చేసుకోవడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించడం తగదన్నారు. ఇప్పటికైనా తక్షణమే షాపింగ్ కాంప్లెక్స్ ను స్వాధీనం చేసుకుని షాపులను బహిరంగవేలం ద్వారా అద్దెకు ఇవ్వాలని కోరారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోని అధికారుల ఫోటోలను ట్యాంక్ బండ్‌పై ప్రదర్శించాలి

### అక్రమ నిర్మాణాలపై అధికారుల తీరుపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**కుషాయిగూడ, జూలై 01, (తెలంగాణ దిశ) :** అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోని అధికారుల ఫోటోలను ట్యాంక్ బండ్‌పై ప్రదర్శించాలని జస్టిస్ విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఉత్తర్వులు జారీ చేశామని స్టాండింగ్ కౌన్సిల్ చెబుతుందన్నారు. టాస్క్ ఫోర్స్ అధికారులకు ఉత్తర్వులను పంపించామని జీహెచ్ఎంసీ అధికారులు చెబుతున్నారని వెల్లడించారు. పోలీసుల నుండి భద్రత లేదని టాస్క్ ఫోర్స్ అధికారులు చెబుతున్నారని అన్నారు. అది శాంతి భద్రతల సమస్య అని పోలీసులు చెబుతున్నారని, ఇలా అందరూ చేతులు దులుపుకుంటే ఎలా అని హైకోర్టు ధర్మాసనం అధికారులపై అసహనం వ్యక్తం చేసింది. వచ్చే వాయిదాలోగా పిటిషనర్ ఇచ్చిన వినతి పత్రంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని హైకోర్టు అధికారులను ఆదేశించింది.



# సంపాదకీయం

## పొంచి ఉన్న ఆయిల్ సంక్షోభం..!

పశ్చిమాసియాలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా భారతీయ వాణిజ్య రంగానికి సంక్షోభం తప్పదు. చమురు, సహజ వాయువు, ఎరువులు, తదితర ముఖ్య అవసరాలు సరిగ్గా సరఫరా కాక, వాణిజ్యంలోనే కాదు, ప్రజల జీవన విధానంలో కూడా ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి. ముఖ్యంగా చమురు సంక్షోభం సంభవిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర ఒక్కసారిగా పెరిగిపోతుంది. మనకు ఎఉ?కవగా చమురును, గ్యాస్‌ను సరఫరా చేసేది రష్యా, ఇరాన్ దేశాలే. ఆయా దేశాల నుంచి సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే మన దేశం భారీగా అంతర్జాతీయ మార్కెట్‌కు మూల్యం చెల్లించుకోవలసి వస్తుంది. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో రష్యా నుంచి మనదేశానికి ముడి చమురు దిగుమతులు రోజువారీ సరాసరిన (మిలియన్ పెర్ డే) 1.41 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశం. జనవరి నాటికి రోజువారీ 1.49 మిలియన్ బ్యారెళ్ల వంతున తగ్గిపోగా అంతకన్నా ఇప్పుడు తగ్గడం గమనార్హం. కార్గో ట్రాకింగ్ ఏజెన్సీ వోర్టెక్స్ వివరాల ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరిలో రోజువారీ మొత్తం 4.77 మిలియన్ బ్యారెళ్లుగా చమురు దిగుమతులు జరిగాయి. జనవరిలో రోజువారీ మొత్తం 4.76 మిలియన్ బ్యారెళ్ల చమురు దిగుమతులు కాగా పెద్దగా మార్పు లేదు. అయితే ఈ మార్చి, ఏప్రిల్ నెలల్లో మరింతగా చమురు దిగుమతులు క్షీణిస్తాయని వోర్టెక్స్ చెబుతోంది. దీనికి కారణం అమెరికా ఆఫీస్ ఆఫ్ ఫారెస్ అసెట్స్ కంట్రోల్ (ఒఎఫ్ఎసి) జనవరి 10 న విధించిన ఆంక్షలే.అయితే ఈ లోటును పశ్చిమాసియా దేశాలు భర్తీ చేస్తాయని ఎపిఎసి అనాలిసిస్ వోర్టెక్స్ అధినేత ఇవాన్ మేథ్యూ వెల్లడించారు. రష్యా చమురు ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సర్గుట్ నెఫ్ట్ గ్యాస్‌లతో పాటు దాదాపు 180 ట్యాంకర్లపై తాజాగా జనవరి 10న అమెరికా ఆంక్షలు విధించింది. రష్యాకు రెవెన్యూ రాకుండా అడ్డుకోవడమే దీని వెనుక ఉన్న ఆంతర్యం. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగించడానికే రష్యా ఈ ఆదాయాన్ని ఖర్చు పెడుతోందని అమెరికా ఆరోపిస్తోంది. ఫలితంగానే రష్యా చమురు కార్గో నౌకలు ఫిబ్రవరి 27 నాటికి అమెరికా ఆంక్షల సుడిలో చిక్కుకోవలసి వచ్చింది. 2024 మొదటి ఏడు మాసాలు (జనవరి జులై) ఇజ్రాయెల్, జోర్డాన్, లెబనాన్ దేశాలకు భారత్ నుంచి వాణిజ్యంలో సంఘర్షణలు తప్పలేదు. భారత్ నుంచి ఇజ్రాయెల్‌కు 63.3 శాతం వరకు ఎగుమతులు పతనమయ్యాయి. దీని విలువ 1.3 బిలియన్ డాలర్లు. ఆర్గానిక్ కెమికల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, డైమండ్స్, ఎగుమతులకు గండి పడిందని వాణిజ్య విభాగం వెల్లడించింది. అలాగే జోర్డాన్‌కు ఎగుమతుల్లో 38 శాతం అంటే 638 మిలియన్ డాలర్ల వరకు, లెబనాన్‌కు 7% అంటే 198 మిలియన్ డాలర్ల వరకు ఎగుమతులు పతనమై భారత్‌కు నష్టాలు సంభవించాయి. 2024 వరకు అంతకు ముందు ఏడేళ్లుగా ఏటా 3% వంతున ముడిచమురు ఉత్పత్తిలో తగ్గుదల కనిపిస్తోంది. ఉత్పత్తిలో తగ్గుదల ఉంటున్నా వినియోగం పెరుగుతుండడంతో భారత్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తోంది. 2017 నుంచి 2024 వరకు 86 నుంచి 89 శాతం వరకు దిగుమతులపైనే దేశం ఆధారపడవలసి వచ్చింది. భారత ఇంధన వినియోగ చిత్ర 2024 ఆర్థిక సంవత్సర నివేదికలో ఇదో భాగం. దేశం ఇంధనాన్ని సేకరించడం, ఉత్పత్తి, వినియోగం తాలూకు ఆమూలాగ్ర డేటాను ఈ నివేదిక అందిస్తోంది. కేంద్ర ఇంధన మంత్రిత్వశాఖ నేతృత్వంలో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫీషియెన్సీ (బిఇఇ)ఈ నివేదికను రూపొందించింది. 2024 ఆర్థిక సంవత్సరంలో మొత్తం సరఫరా అయిన ఇంధనం 910 మిలియన్ టన్నులు కాగా, ఇందులో బొగ్గు నుంచి 60%, చమురు నుంచి 28%, గ్యాస్ నుంచి 7%, శిలాజేతర వనరుల నుంచి 5% సరఫరా అయింది. స్వదేశీ చమురు ఉత్పత్తి 2017 ఆర్థిక సంవత్సరంలో 36 మిలియన్ టన్నులు కాగా, 2024 నాటికి 29.4 మిలియన్ టన్నులకు తగ్గిపోయింది. వార్షిక రేటు 3% వరకు తగ్గుతూ వస్తోంది. ఈ తగ్గుదలకు అనేక కారణాలు దోహదం చేస్తున్నాయి. ఈ కొరతను అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు 2019లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లొరేషన్ అండ్ లైసెన్సింగ్ (హెచ్ఇఎల్‌పి) వంటి ప్రక్రియను అమలుచేసే చర్యలను తీసుకుంది.ఎంపికైన చమురు క్షేత్రాల్లో తగిన సాంకేతిక విధానాలు అమలు చేసి చమురు ఉత్పత్తిని సాధించడమే ఈ విధానం లక్ష్యం. చిన్న, మధ్యతరహా స్థాయిలో చమురు పరిశోధనలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ద్వారా ఆయా సంస్థలను ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ నిర్వహణలోని ఒఎన్‌జిసి, ఆయిల్ ఇండియా సంస్థలు క్రమంగా 65 శాతం, 11 శాతం వరకు 20232024 సంవత్సరంలో చమురును అందించగలిగాయి. మిగతా 24 శాతం ముడిచమురు ఉత్పత్తి ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్ట్ (పిఎస్‌సి) లేదా రెవెన్యూ షేరింగ్ కాంట్రాక్ట్ (ఆర్ఎస్‌సి) ద్వారా లభించింది. 2024 ఏప్రిల్ 1 నాటికి సమతుల్యతలో తిరిగి పొందగలిగిన చమురు నిల్వలు 671.4 మిలియన్ టన్నులుగా భారత్ అంచనా వేసింది. అంతకు ముందు సంవత్సరం నాటి 669.47 మిలియన్ టన్నుల నిల్వలతో పోల్చుకుంటే 0.3 శాతం ఎక్కువ.స్వదేశీ చమురు ఉత్పత్తి కన్నా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో చమురు దిగుమతులపై ఆధారపడడం మరింత ఎక్కువ అవుతుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద చమురు దిగుమతి దారైన భారత్ 2024లో 234 మిలియన్ టన్నుల చమురును సేకరించుకోగలిగింది. సరఫరా కావలసి చమురులో 86% 2017లోను, 89% 2024 లోనూ దిగుమతి చేసుకోవలసి వచ్చింది. కొవిడ్ మహమ్మారి సమయంలో చమురు దిగుమతులు తాత్కాలికంగా 202122 లో తగ్గాయి. భారీ స్థాయిలో దిగుమతి చేసుకున్నామంటే రిఫైన్డ్ పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం భారీగా పెరుగుతున్నట్టే భావించక తప్పదు. 2024 ఏప్రిల్ 1నాటికి ఏడాదికి 256.8 మిలియన్ టన్నుల చమురును రిఫైనింగ్ చేసే సామర్థం భారత్‌కు ఉందని తేలింది. దీంతో ప్రపంచంలో అమెరికా, చైనా, రష్యా తరువాత నాలుగో రిఫైనర్‌గా భారత్ నిలుస్తోంది. పశ్చిమాసియాలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా భారతీయ వాణిజ్య రంగానికి సంక్షోభం తప్పదు. చమురు, సహజ వాయువు, ఎరువులు, తదితర ముఖ్య అవసరాలు సరిగ్గా సరఫరా కాక, వాణిజ్యంలోనే కాదు, ప్రజల జీవన విధానంలో కూడా ఒడిదుడుకులు ఎదురవుతుంటాయి.

## సీఎం సహాయనిధి పేదలకు ఆపదలో చేయూత...

### కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్, జూలై 01, (తెలంగాణ దిశ)** :అనారోగ్యంతో బాధపడుతున్న నిజాంపేట్ కు చెందిన సిహెచ్. శ్రీనివాస్ రావుకు నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందే నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు చేయించిన రూ. 2.5 లక్షల ఎల్ఓసిని బాచుపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి అందజేశారు. శ్రీనివాసరావు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందేందుకు ఆర్థిక స్థోమత లేదని తెలుసుకున్న హన్మంత్ రెడ్డి స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడికి శస్త్ర చికిత్స నిమిత్తం ఎల్ఓసి మంజూరీ చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్కుల మల్లేష్



యాదవ్, దూసకంటి పద్మ రావు, గోపాల్ యాదవ్, సంజీవ రెడ్డి, అంజాద్, నర్సింగ్ రావు, ఎండీ. షకీల్ ఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు

## పిడిఎస్ యు ఆధ్వర్యంలో 72 గంటలు కళాశాలల బంద్ విజయవంతం చేయాలి

### - గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తీగల శ్యామ్- పెండింగ్ లో ఉన్న రూ.7200 కోట్ల స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలి

**కాప్రా, జూలై 01, (తెలంగాణ దిశ)** : కాప్రా మండల కేంద్రంలో పిడిఎస్ యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పెండింగ్ స్కాలర్ షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయాలని జూలై 2, 3, 4 తేదీలలో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ కళాశాల బంద్ పిలుపును విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ ఈ కార్యక్రమానికి పిడిఎస్ యు జిల్లా నాయకులు యశ్వంత్ సభ అధ్యక్షత వహించగా ఈ సందర్భంగా పిడిఎస్ యు గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి తీగల శ్యామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న రూ. 7200 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్ మెంట్ రాక పేద విద్యార్థులు విద్యకు దూరమవు తున్నారని అన్నారు. అంతేగాక డిగ్రీ, పీజీ చదువుకున్న విద్యార్థులుపై తరగతికి వెళ్లాలంటే ఇటు ప్రభుత్వ యజమాన్యం, అటు ప్రైవేటు యజమాన్యం విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజు మొత్తం కట్టించుకుని ఇస్తున్నారని అన్నారు. దీంతో ఫీజు కట్టలేని పేద విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, రాను రాను ప్రభుత్వాలు స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ పథకాన్ని ఎత్తి వేయాలని చూస్తున్నాయని విమర్శించారు. ఇందులో భాగంగానే రాష్ట్ర, కేంద్ర




ప్రభుత్వాలు యూనివర్సిటీలను, ప్రభుత్వ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించే విధంగా పాలన కొనసాగిస్తున్నాయని విమర్శించారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలని లక్ష్యంతో పాలకవర్గాలు స్కాలర్ షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయడం లేదని ఆయన అన్నారు. తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా నాయకులు హరీష్, శ్రీవల్లి, అనూష, మహేందర్, స్రవంతి, నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

## వరికి మద్దతు ధర కరువు..!

**మిర్యాలగూడ,తెలంగాణ దిశ:** ప్రభుత్వ అధికార యంత్రాంగం ముందు చూపు లేక అన్నదాతలు పండించిన ధాన్యానికి మద్దతు ధర లభించడం లేదురు. మిల్లర్లు పెట్టిన ధర కు రైతులు విక్రయించాల్సిన దుర్భర పరిస్థితి నెలకొంది. దీంతో అన్నదాతలు కష్టించి పండించిన ధాన్యానికి ధర అందక నానా అవస్థలు పడుతున్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రబీ ధాన్యానికి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని మిల్లర్ల ను హెచ్చరించిన ఫలితం లేకపోయిందని అన్నదాతలు వాపోతున్నారు.

ఖరీఫ్ ధరలేవి..?: ఖరీఫ్ సిజన్‌లో ధాన్యం చెల్లించిన ధరలో దగ్గరగా లేకుండా కొనుగోలు చేస్తున్నారు. గత ఖరీఫ్ సీజన్ లో క్వింటాళ్లకు రూ. 2800 చెల్లించి మిల్లర్లు కొనుగోలు చేశారు.


కానీ రబీ సీజన్ ప్రారంభమై ఇరవై రోజులు అవుతున్న ధరలు మాత్రం పెంచడం లేదు. గత వారం రోజుల నుంచి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయకపోవడమే కాక కనీస మద్దతు ధర కూడా చెల్లించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 2320 ఉండగా మిల్లర్లు కేవలం రూ. 2100 నుంచి 2250 వరకు ధరలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కొందరు మిల్లర్లు అసలు కొనుగోలు చేయడంలో ఆసక్తి చూపడం లేదని రైతులు వాపోతున్నారు.

భారీగా నష్టపోతున్న రైతులు..: వరి సాగులో పెట్టుబడులు పెరిగి ఇబ్బంది పడుతున్న రైతులు ధాన్యం విక్రయంలో నష్టాలను చవి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. గిట్టుబాటు ధర వస్తాదని ఆశించి సన్నాలు సాగు చేసిన రైతులకు మద్దతు ధర కూడా రాక క్వింటాళ్లకు రూ. 500 వరకు నష్టం వాటిల్లితుంది. ఇప్పటికే మిర్యాలగూడ నియోజకవర్గ వ్యాప్తంగా లక్షల క్వింటాళ్ల ధాన్యం విక్రయాలు జరిగినట్లు అంచనా ఉంది. ఈ విధంగా రైతులు కోట్ల రూపాయాలు నష్టం జరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు.

మిల్లర్ల మాయాజాలం..: మిర్యాలగూడ నియోజకవర్గం లో వందల సంఖ్యలో మిల్లులు ఉండటంతో ధాన్యం కొనుగోలు లో మిల్లర్లు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. మిల్లర్లు సిండికేట్ గా ఏర్పడి విడతల వారీగా కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా వేములపల్లి ,మిర్యాల గూడ మండలాల లో కొందరు మిల్లర్లు ఉదయం కొంతమేరకు కొనుగోలు చేసి మిల్లర్ల గేట్లకు తాళాలు వేస్తున్నారు. కొందరు సాయంత్రం వేళ కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల రాత్రి అవుతుండటం వలన ధరలు మరింత తగ్గిస్తున్నారు. దీంతో రాత్రి బస చేయలేక రైతులు మిల్లర్లు పెట్టిన ధరకే అమ్ముకుంటున్నారు.

మద్దతు ధర చెల్లింపులపై కొరవడిన నిఘా..: మద్దతు ధర చెల్లించడంలో ప్రభుత్వ అధికార యంత్రాంగం దృష్టి సారించడంలో జాప్యం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. గత సీజన్లో రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం మిల్లర్ల వద్ద మద్దతు ధర చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నారు. కానీ నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదని రైతులు పేర్కొన్నారు . రెండు రోజుల క్రితం వేములపల్లి మండలం శెట్టి పాలెం మిల్లర్లు వద్ద మద్దతు కూడా పెట్టడం లేదని ఓ రైతు నేరుగా కలెక్టర్ కుఫోన్ లో ఫిర్యాదు చేశాడు. మద్దతు ధర చెల్లించని మిల్లులపై చర్యలేవి ..: ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరచెల్లించని మిల్లుల పైచర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రూ.2100 లకే ధాన్యం కొనుగోలు చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. శెట్టి పాలెంసమీపంలో ఉన్న మిల్లర్లు గత నాలుగు రోజుల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. ఇలాంటి మిల్లులలో ధాన్యం విక్రయ రికార్డులుపరిశీలించి చర్యలు తీసుకోవా లని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీనివల్ల మిల్లర్లు మద్దతు ధర చెల్లించే అవకాశం ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## లెబనాన్‌పై దాడులు మానవ హక్కుల ఉల్లంఘనే..!




ఐరాస: లెబనాన్‌పై ఇజ్రాయిల్ వైమానిక దాడులు అంతర్జాతీయ మానవహక్కుల చట్టాలను ఉల్లంఘించడమేనని ఐరాస శరణార్థుల హైకమిషనర్ ఫిలిప్పో గ్రాండి వ్యాఖ్యానించారు. సాధారణ పౌరులను చంపడంతో పాటు మౌలిక సదుపాయాలు లక్ష్యంగా ఇజ్రాయిల్ బాంబు దాడులతో లెబనాన్‌పై విరుచుకుపడటాన్ని తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన లెబనాన్ మీడియాతో మాట్లాడారు. ఇజ్రాయిల్ వైమానిక దాడులు అంతర్జాతీయ మానవహక్కుల చట్టాలను ఉల్లంఘించడంతో పాటు మానవతా కార్యకలాపాలను ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. ఇరాన్ మద్దతు గల హిజ్బుల్లా లక్ష్యంగా పేర్కొంటూ ఇజ్రాయిల్ చేపడుతున్న వైమానిక, భూతల దాడులతో లెబనాన్‌లో సుమారు 12 లక్షల మంది నిరాశ్రయులయ్యారని అన్నారు. ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఉన్న అన్ని దేశాలతో పాటు, సాయం అందిస్తున్నవారు ఈ రోజు గాజాలో, లెబనాన్‌లో జరుగుతున్న మారణహోమాన్ని అపాలని అన్నారు. లెబనాన్‌లో వివిధ ప్రదేశాలలో ప్రభావితమైన ఆరోగ్య సదుపాయాలతో పాటు మానవ హక్కుల తీవ్రమైన ఉల్లంఘనల గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ తనకు వివరించిందని గ్రాండి తెలిపారు. పౌరుల నివాసాలపై దాడులు కూడా ఉల్లంఘనలేనని అన్నారు. దాడులతో 2,20,000 మంది సిరియా మీదుగా లెబనాన్ సరిహద్దు దాటారని, వీరిలో 70 శాతం మంది సిరియన్లు, 30 శాతం మంది లెబనాన్ వాసులు ఉన్నారని అన్నారు.

అయితే ఇవి ప్రాథమిక అంచనా మాత్రమేనని చెప్పారు. గత సిరియా ప్రధాన సరిహద్దు మస్నాపై ఇజ్రాయిల్ దాడులతో విరుచుకుపడిందని, అయితే ప్రజల వలసలు కొనసాగుతున్నాయని అన్నారు. తిరిగి తమ నివాసాలకు చేరుకుంటున్న సిరియన్లకు తగిన భద్రత, కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఇప్పుడు సిరియా ప్రభుత్వంపై ఉందని అన్నారు.పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు ఇరాన్ మరింత ఆజ్యం పోస్తుందా? అందులో భాగాంగానే తాజాగా అణు పరీక్షలు నిర్వహించిందా? రాత్రి ఇరాన్, ఇజ్రాయెల్ భూభాగాల్లో దాదాపు ఒకే సమయంలో భూకంపం సంభవించడం ఈ అనుమానాలకు మరింత తావిస్తోంది.స్థానిక కాలమాన ప్రకారం రాత్రి 10.45 నిమిషాలకు ఇరాన్ లోని అరదాన్ నగర సమీపంలో సంభవించిన భూకంపం తీవ్రత 4.5గా నమోదు అయ్యింది. అక్కడికి 110కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇరాన్ రాజధాని టెహ్రాన్ లో కూడా ఈ ప్రకంపనలు వచ్చాయని అమెరిక భౌతిక సర్వే విభాగం ధ్రువీకరించింది. తర్వాత కొద్ది నిమిషాలకు ఇజ్రాయెలోలోనూ భూ ప్రకంపనలు వచ్చాయి. ఇది భూకంపం కాదని..కచ్చితంగా భూగర్భ అణు పరీక్షల పర్యవసానమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. భూకంపం సంభశించింది కూడా అణు ప్లాంట్ కు అతి సమీపంలోనే అంటూ వస్తున్న వార్తలు ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుతున్నాయి.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**కాప్రా, జూలై 01, (తెలంగాణ దిశ)** : కాప్రా గాంధీనగర్ లో మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గాంధీనగర్ పల్లె దవాఖాన ప్రాంగణంలో జరిగిన వైద్య శిబిరానికి స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులకు ఉచిత వైద్య సేవలతో పాటు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, ప్రాథమిక హెల్త్ సెంటర్ కుషాయిగూడ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, పల్లె దవాఖాన సెంటర్ డాక్టర్ ప్రసన్న, డాక్టర్ మధులిక, మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొత్త అంజిరెడ్డి, గాంధీనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పాశ మైలారం "సిగాచి" ప్రమాద స్థలాన్ని సందర్శించిన టిడిపి నేతలు





**హైదరాబాద్, జూలై 01, (తెలంగాణ దిశ)** :సంగారెడ్డి జిల్లా పాశ మైలారం పారిశ్రామిక వాడలో సిగాచి రసాయన పరిశ్రమలో ఘోర ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని మంగళవారం టీటీడీపీ నేతలు సందర్శించారు. పార్టీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కిని నరసింహులు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి, జాతీయ అధికార ప్రతినిధి నెల్లూరి దుర్గా ప్రసాద్, మేడ్చల్ జిల్లా కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్, మెదక్ జిల్లా కన్వీనర్ ఇల్లెందుల రమేష్ తదితరులు సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి ఉప్పల్ అడ్ హాక్ కమిటి మెంబర్ నీరు కొండ సతీష్ బాబు, టిఎన్ఎస్ఎఫ్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

కల్లూరు: వివిధ అంశాల్లో తీర్ఫుదునిస్తోంది. శిక్షణతో సరిపెట్టక అర్హులైనవారికి రుణాలిచ్చి తమ కాళ్లపై తాము నిలబడేలా తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే వేలాది మంది శిక్షణ తీసుకుని స్వయం ఉపాధి సాధించడం విశేషం. కర్నూలు నగరంలో కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థను 2003లో ప్రారంభించారు. అప్పటినుంచి గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు నిరంతరం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 10,13,30 రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. ఈ సమయంలో వారికి ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తారు. ప్రతి నెలా ఏదో ఒక రంగంలో తర్ఫీదు ఇస్తుంటారు. యువతలో నైపుణ్యాలను వృద్ధి చేసి స్వయం ఉపాధి కల్పించడమే సంస్థ ముఖ్య ఉద్దేశం. సంస్థ ప్రారంభించినప్పటి నుంచి నేటివరకు

## టిడిపి పటిష్టత కోసం కృషి చేయాలి



తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు మరింత కృషి చేయాలని టిటిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కిని నరసింహులు సూచించారు. మంగళవారం పార్టీ నేతలు కందికంటి అశోక్ కుమార్ గౌడ్, నెల్లూరి దుర్గా ప్రసాద్ లతో కలిసి స్థానిక టిడిపి నేతలు ఎన్టీఆర్ భవన్ లో సమావేశమయ్యారు. స్థానిక నేతలు నీరుగొండ సతీష్ బాబు ఎం. శివానంద్ పాల్గొన్నారు.

(ఏఎస్ రావునగర్ తెలంగాణ దిశ)

# మూలన పడ్డ మోటార్లు.. నీరందక జనం పాట్లు!

**అమరావతి,తెలంగాణ దిశ:** ఓగంట పని చేయకపోతే ఒక కాలనీకి నీటి సరఫరా ఆగిపోతుంది. అలాంటిది పది రోజుల నుంచి రెండు మోటార్లు పూర్తిగా పని చేయక గుజ్జనగుళ్ల ట్యాంకుల పరిధిలోని పది కాలనీలకు నీరందడం లేదు. హెచ్ఎల్ఆర్ నుంచి ఓ లైను ద్వారా ఇక్కడికి ట్యాంకులకు నీరు చేరుతుంది. ప్రస్తుతం ఎస్వీఎన్కాలనీ, చంద్రబాబునాయుడుకాలనీ, నాయీబ్రాహ్మణ కాలనీ, సాయికృష్ణన గర్, కల్యాణి నగర్, రత్నగిరినగర్ తదితర పది కాలనీల్లో ప్రజలు నానా యాతన పడుతున్నారు. రెండు రోజుల క్రితం మోటారు పంపుసెట్ను పునరుద్ధరించారు. రెండోదానికి అవసరమైన సామగ్రి కోసం ఆర్డర్ పెట్టామని అవి శుక్రవారం సాయంత్రానికి వస్తాయని అధికారులు చెబుతున్నారు. దీని మరమ్మతు ఎప్పటికి పూర్తవుతుందన్నది స్పష్టత రావడం లేదు. రెండు పంపుసెట్ల బుష్లు అరిగిపోయి మోటార్లు సామర్థ్యం మేరకు పని చేయడం లేదని, శుక్రవారానికల్లా సమస్య పరిష్కారమవుతుందని ఇంజినీరింగ్వర్గాలు తెలిపాయి. బుష్ల కోసం ఆర్డర్ పెట్టామని వెల్లడించాయి. అపార్ట్మెంట్లకు మినహా మిగిలిన ఇళ్లకు ట్యాంకర్ల ద్వారా నీటిని పంపుతున్నామని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తున్నామని యంత్రాంగం చెబుతున్నా.. ఏ మూలకూ సరిపోవడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో సమస్య పరిష్కారమవు తుందని అధికారులు చెబుతున్నారు.



బహుళ అంతస్తుల భవనాల్లో నివారు అన్ని అవసరాలకూ నీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. ఇళ్ల ముందు పీపాలు : కొన్ని కాలనీల్లో అద్దెకు తెచ్చుకున్న నీళ్ల పీపాలు ప్రతీ ఇంటి ముందు కనిపిస్తున్నాయి. నీళ్లందక ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను ఎప్పటికి పరిష్కరిస్తారో చెప్పాలంటే గురువారం రత్నగిరినగర్లో కాలనీవాసులు ఆందోళన చేశారు. సమస్య తీవ్రంగా ఉన్నా.. ఉన్నతాధికారులు రంగంలోకి దిగకపోవడాన్ని వారు ప్రశ్నించారు. ఇటీవల ఇంజినీరింగ్ విభాగంలో కొత్తగా వచ్చిన అధికారులకు తాత్కాలికంగా విధులు కేటాయించారు. తమకు అనుకూలమైన వార్డులు, కార్యాలయాలు రాలేదని చుట్టుపుచూపుగా వచ్చి వెళ్లిపోతున్నారు.

# అభివృద్ధికి నోచని దళితకాలనీ



**హనుమంతునిపాడు,తెలంగాణ దిశ:** మండల పరిధిలోని వీరరాంపురం దళితకాలనీ దశాబ్ద కాలంగా అభివృద్ధికి నోచలేదని సిపిఎం మండల నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు తెలిపారు. దళితకాలనీ అభివృద్ధి గురించి నాయకులు, అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా బురదమయంగా మారిన వీరరాంపురం దళిత కాలనీలో స్థానికులతో కలిసి బుధవారం పర్యటిం చారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత పది సంవత్స రాలుగా దళితవాడకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారినట్లు తెలిపారు. చిన్నపాటి వర్షాలకే రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు తెలిపారు. రహదారిపై రెండు నుంచి మూడు అడుగుల లోతున గుంతలు ఏర్పడినట్లు తెలిపారు. రోడ్డు అభివద్ధికి పది సంవత్సరాల క్రితం శంకు స్థాపన చేసినట్లు తెలిపారు. ఐదు సంవత్సరాల క్రితం చిప్స్ తోలి వదిలేసినట్లు ఆయన తెలిపారు. కాలనీలో డ్రైనేజీ సౌకర్యం కూడా లేకపోవడంతో ఇళ్ల మధ్యలోనే నీరు నిలబడి మురికి కూపంగా తయారైనట్లు తెలిపారు. మురుగు నీరు పేరుకు పోవడంతో దుర్వాసన వెదజల్లుతున్నట్లు తెలిపారు. దోమల వ్యాప్తి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. గతంలో దళిత కాలనీకి ఆర్టిసి బస్సు వచ్చేదని, రహదారి అధ్వానంగా మారడంతో బస్సు సర్వీసు కూడా రద్దు చేసినట్లు తెలిపారు. దీంతో అత్యవసర పరిస్థితులో హాస్పిటల్ వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు నడిచి పోవాల్సి వస్తుందని తెలిపారు. దీంతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.దళిత వాడ మీదుగా గ్రామానికి సాగర్ పైపు లైన్ ఉన్నప్పటికీ కాలనీ వాసులు సాగరనీరు తాగేందుకు నోచలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళితకాలనీ వెళ్లే రోడ్డు, నందనవనం రోడ్డు నుంచి దళితకాలనీ మీదుగా కనిగిరి గుడిపాటి పల్లి రోడ్డుకు లింకు చేసి రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. దళిత కాలనీలోడ్రైనేజీ సౌకర్యం, సాగర్ తాగునీటి పాయింట్ ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రాబర్ట్, నాగయ్య, ఇస్మాయిల్, గోన నాగయ్య, ఇజ్రాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ షాక్.. టీడీపీలో చేరిన

# వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు

**ఎమ్మిగనూరు,తెలంగాణ దిశ:** కూటమి అంటే అభివృద్ధి.. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు తోనే సాధ్యమవుతుందని ఆశించి ఈరోజు వైసీపీ కౌన్సిలర్లు టిడిపిలోకి చేరుతున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు . మంగళవారం ఎమ్మిగనూరు మున్సిపల్ వైసీపీ కౌన్సిలర్లు సరోజ, వహిద్, స్వాతి, వైసీపీ సోషల్ మీడియా నాయకులు మన్సూర్ బాషా, జహీర్, వినయ్ లతో మాజీ కౌన్సిలర్ వహబ్ పాటు తదితరులు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి కౌన్సిలర్లు పార్టీలో చేరడం సంతోషకరమన్నారు. గత ఐదేళ్ల నుండి టిడిపి పార్టీ కోసం కష్టపడిన నాయకులు కార్యకర్తలు ఉన్నారని, వారికి పార్టీ సముచిత స్థానం కల్పించడం జరుగుతుందని, అదేవిధంగా పార్టీలో మోసం చేయాలని మోసపూరిత డ్రామాలు చేసిన వ్యక్తులు కూడా ఉన్నారని తెలిపారు. వైసీపీలో కౌన్సిలర్లు వారి వారి వార్డులో ఒక అభివృద్ధి పని కూడా చేసుకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. కనీసం ఒక వ్యక్తికి సహాయం చేసిన పాపనా పోలేదన్నారు. ఆఖరికి స్థానిక సంస్థల నిధులు కూడా మాజీ సీఎం జగన్ గందరగోళ



పరిస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీకి కష్టపడిన నిజాయితీ కార్యకర్తలకు బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ఏరోజు మర్చిపోడని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి అజెండాతో ప్రతి ఒక్కరు ముందుకు పోవాలని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో వార్డుల్లో అభివృద్ధి చేసుకోలేక పోయారని, కౌన్సిలర్లు వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను తాను నెరవేరుస్తానని ఎమ్మెల్యే బీవీ స్పష్టం చేశారు.

# తెగుళ్ల నివారణపై అవగాహన పెంచుకోవాలి




**సిఎస్ పురం,తెలంగాణ దిశ:** పంటలపై సోకే తెగుళ్ల నివారణపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ ఏడిఏ ఇవి రమణ తెలిపారు. మండలంలోని వెంగనగుంట, ఆర్కె పల్లి పంచాయతీల్లో పొలం పిలు స్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వరి పంటలో ఆకు ముడత, కాండం తొలుచు పురుగు, అగ్గి తెగులు నివారణ వంటి వాటిపై రైతులకు పూర్తి అవగాహన కల్పించారు. కంది, మినుము పంటలపై సోకే తెగులు గురించి, విత్తన శుద్ధి గురించి రైతులకు వివ రించారు. సకాలంలో పురుగు మందులు వాడినట్ల యితే తెగుళ్లబారి నుంచి పంటను కాపాడుకోవచ్చనన్నారు. ముఖ్యంగా విత్తనాలు వేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది శ్రీనివాసులు, ఎం వెంకటరెడ్డి, ఏ వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. పీసీపల్లి: పండ్ల తోట రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీని ఉపయోగించుకోవాలని పిసిపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ షారుఖ్ అన్నారు. మంగళ వారం వ్యవసాయ శాఖఆధ్వర్యంలో మండలంలోని పెదఇర్లపాడు, వెంగళాయపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షారుక్ మాట్లాడుతూ శనగ విత్తనాలు అవసరమైనవారు రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఉద్యానవన శాఖ అధికారి కుసుమ మాట్లాడుతూ 40 శాతం సబ్సిడీపై పండ్ల తోటలు, పూల మొక్కల పెం పకానికి ప్రభుత్వం రాయతీ ఇస్తుందని అన్నారు. 90 శాతం సబ్సిడీపై డ్రిప్పు అందిస్తున్నామన్నారు. రైతులు వ్యక్తిగత నీటి కుంటలు తవ్వుకునేందుకు 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పుల్లయ్య, విఏఏ రామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సంతనూతలపాడు: మండలంలోని రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది.

# దాచేపల్లిలో డయేరియా లక్షణాలు..!

**దాచేపల్లి,తెలంగాణ దిశ:**డయేరియా లక్షణాలతో దాచేపల్లిలో ఇద్దరు మృతి చెందడంతో జిల్లా యంత్రాంగం రంగంలోకి దిగింది. ఒకవైపు పారిశుద్ధ్య పనులు చేపడుతూనే.. మరోవైపు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులను గుర్తించి చికిత్స అందించే పనిలో పడింది. పాత కాలం నాటి పైపులు.. మురుగుకాల్వ పక్కనే బోరు ఉండటంతో దాచేపల్లి అంజనాపురం కాలనీలో డయేరియా ప్రబలడానికి కారణంగా తెలుస్తోంది. బోరు నుంచి ఇళ్లకు సరఫరా అయ్యే పైపులన్నీ ఎప్పటివో కావడం.. వాటికి చాలాచోట్ల లీకేజీలు ఉండడంతో మురుగు చేరి కలుషితమై ఉండొచ్చని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. బోరునీటిని పరీక్షలకు పంపించారు. కలెక్టర్ తన షెడ్యూల్లో కార్యక్రమాలను రద్దు చేసుకుని దాచేపల్లిలోనే ఉండి కాలనీలో పర్యటించి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కాలనీలో పర్యటించి డయేరియా ప్రబలడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. అంజనాపురం కాలనీలో సుమారు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీ మొత్తానికి ఉన్న ఒక బోరు కూడా మురుగు కాలువ పక్కనే ఉండడం విశేషం. వర్షాకాలం వచ్చిందంటే మురుగు మొత్తం ఈ బోరులోకి చేరి నీళ్లు కలుషితమవుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరుతో మరమ్మతులకు గురైన పైపులతో ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని సరఫరా చేస్తున్నారు. పైపులన్నీ మురుగుకాల్వ పక్క నుంచే వెళు న్నాయి. ఈ పైపులు ఏర్పాటు చేసి సంవత్సరాలు కావడంతో లీకేజీలు ఏర్పడి నీరు కలుషితమవుతోంది. మురుగు కాలువల్లో పూడిక తీయక నెలలు గడుస్తున్నా ఈ కాలనీ వైపు చూసే నాథుడే కరువయ్యాడు. కొన్ని వీధుల్లో మురుగు కాలువలు లేక ఇళ్ల ముందే గుంతలు తీసి మురుగు ఎత్తి పోసుకుంటున్నారు. సీసీ రోడ్లు లేక వర్షం వచ్చిందంటే మురుగు రోడ్లపైనే నిల్వ ఉంటోంది. వాంతులు, విరేచనాలతో ఇద్దరు మృతిచెందాక..



అధికార యంత్రాంగం హుటాహుటీన ఈ ప్రాంతానికి చేరుకొని మురుగు కాలువలు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. కాలనీలో అతిసార వ్యాపించగా.. వెంటనే జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై చర్యలు చేపట్టింది. శ్రీనివాసరావు, కలెక్టర్ పి.అరుణ్బాబు దాచేపల్లిలో పర్యటించారు. వైద్య, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. కాలనీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఇంకా ఎవరైనా అనారోగ్యానికి గురయ్యారా? వైద్య శిబిరాలు, మందుల అందజేత వంటి వాటిని దగ్గరుండి పర్యవేక్షించారు. డయేరియా ఎలా వ్యాప్తి చెందిందనే అంశంపై ప్రభుత్వ వైద్యాధికారులను, స్థానిక పురపాలక అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాలనీలో అతిసార అదుపులోకి వచ్చేంత వరకు కాచి చల్లార్చిన నీళ్లే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పురపాలక పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు డయేరియా ప్రాంతాల్లో పారిశుద్ధ్య చర్యలు కొనసాగించాలని ఆదేశించారు.

# వేంపల్లెలో భారీగా ఇసుక తవ్వకాలు..!

వేంపల్లె రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉచి తంగా ట్రాక్టర్లు ఇసుకను తరలించుకోవచ్చని అను మతి ఇవ్వడంతో వేంపల్లెలోని పాపాగ్ని నదిలో భారీగా ట్రాక్టర్లు ద్వారా ఇసుకను తవ్వకాలు చేపట్టారు. దీంతో తాగునీటి బోర్లలో నీటి మట్టం తగ్గుతుందని రైతులు, ప్రజలు వాపోతున్నారు. గతంలో పాపాగ్ని నుంచి ఇసుకను తరలిస్తే దా డులు చేసి కేసులు నమోదు చేస్తుండడంతో దొంగ చాటునా ట్రాక్టర్ల యాజమానులు తవ్వకాలు చేప ట్టేవారు. వంకలు, వాగులు నుండి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల నుంచి ఉచితంగా ఇసుకను తరలిం చుకోవచ్చని కూటమి ప్రభుత్వం జీవో జారీ చేయడంతో పట్ట పగలే వందలాది ట్రాక్టర్ల పాపాగ్ని నదిలోకి వెళ్లి ఇసుకను తరలిస్తున్నారు. పోలీసులు ఎలాంటి ఆంక్షలు పెట్టక పోవడంతో ట్రాక్టర్ యాజమానులు ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇంటి అవ సరాలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం ట్రాక్టర్లతో ఇసుకను తరలిం చవచ్చు అని చెప్పింది. కొందరు ట్రాక్టర్లు యాజ మానులు ఇదే ఆసరాగా చేసుకుని నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టి ఇటుకల బట్టిల వద్ద, ఇతర ప్రాం తాల్లో ఇసుకను డంప్లుగా ఏర్పాటు చేస్తున్నారు. ఇసుక ఉచితం అనడంతో వైసిపి, టిడిపికి చెందిన ట్రాక్టర్ యాజమానులు జెసిబితో ఇసుకును లోడి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు.



నదిలోనే మండల వాసుల కోసం తాగునీటి బోర్లను ఏర్పాటు చేశారు. ఇసుక తవ్వకాల వల్ల భవిష్యత్లో మండలంలోని ఆయా గ్రామాలకు తాగునీటి సమస్య ఏర్పడే ప్రమా దముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు నదికి అవతల ఒడ్డున్న పంట పొలాలకు సాగునీటికి ఇబ్బం దులు వస్తాయని రైతులూ ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా దాదాపు 150 ట్రాక్టర్లు రోజూ పాపాగ్ని నదిలో ఇసుకను తవ్వకాలు చేపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు ఇసుక తవ్వకాలను నియం త్రించి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# సందేహాల నివృత్తికే అదాలత్

**కడప,తెలంగాణ దిశ:**ఉద్యోగుల పెన్షన్, జిపిఎఫ్లకు సంబంధించి వివిధ సందేహాలను నివృత్తి చేసేందుకే అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్ తెలిపారు. కలెక్టరేట్లోని సభా భవన్లో అకౌంటెంట్ జనరల్, డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీస్, అకౌంట్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో ఉన్న ఉద్యో గుల జిపిఎఫ్, పెన్షన్ సమస్యలపై అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి విరమణ అయిన మరుసటి రోజునే పింఛను మంజూరు చేయాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అన్నారు. అందుకు సంబంధించి ప్రతి ఉద్యోగి ఆరు నెలల లోపుగా అన్ని డాక్యు మెంట్లను పంపించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ అయ్యే సమయానికి సర్వీస్ రిజిస్టర్ అప్డేట్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. సర్వీస్ రిజిస్టర్లో అన్ని ఎంట్రీస్ కరెక్ట్గా ఉండేలా సరిచూసుకోవాలన్నారు. ఉద్యోగులు ఎటువంటి రుణం, పెండింగ్ కేసులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. పెన్షన్ డాక్యుమెంట్స్ తమకు అందిన వెంటనే ఎజి నియమ నిబంధనల ప్రకారం వేగవంతంగా పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తమ దృష్టికి రాని జిపిఎఫ్, పెన్షన్ సమస్యలు ఇంకా ఏమైనా




ఉంటే అదాలత్ దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. సదస్సు అనంతరం జిల్లా వ్యాప్తంగా విరమణ చేసిన పలువురు ఉద్యోగులకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్లను, 30 మందికి జిపిఎఫ్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో సీనియర్ అకౌంటెంట్ ఆఫీసర్లు సునీత, చంద్రశేఖర్, భవాని ప్రసాద్, విజరు కుమార్,కడప ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, సబ్ ట్రెజరీ అధికారులు పాల్గొన్నారు.

## పత్తి ధరపై ప్రైవేటు కత్తి

# భారీగా కోత పెడుతున్న వ్యాపారులు..?




**అమరావతి,తెలంగాణ దిశ:** మద్దతు ధర ప్రకటించినా... భారతీయ పత్తి సంస్థ (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోంది. పల్నాడు జిల్లాలో ప్రైవేటు వ్యాపారులు నాణ్యతను బట్టి క్వింటాలుకు రూ. 5,500 నుంచి రూ. 6,500 వరకు ఇస్తున్నారు. అక్టోబరు 1 నాటికి కొనుగోలు కేంద్రాలను తెరవాల్సిన సీసీఐ వర్షాలు, ఇతరత్రా కారణాలతో జాప్యం చేస్తోంది. మరోవైపు మిర్చి, వరి పంటలకు పెట్టుబడులు పెట్టాల్సిన రైతులు పత్తి దిగుబడులను వెంటనే అమ్మేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు వ్యాపారులు ధరలను బాగా తగ్గించేస్తున్నారు.

క్వింటా మద్దతు ధర రూ.7,521 : కేంద్రం ఈ ఏడాది క్వింటా పత్తికి మద్దతు ధర రూ. 7,521గా నిర్ణయించింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగు విస్తీర్ణం ఆధారంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీసీఐ నిర్ణయించింది. ఎంపిక చేసిన జిన్నింగ్ మిల్లుల్లో సైతం కొను గోలుకు ఏర్పాట్లు చేసింది. అయితే సాంకేతిక కారణాలతో కేంద్రాలు తెరవడంలో జాప్యం చోటుచేసుకుంటోంది. మార్కెటింగ్, రెవెన్యూ, వ్యవసాయశాఖ, సీసీఐ అధికారులు ఇప్పటికే సమావేశమై వివిధాం శాలపై చర్చించారు. వ్యవసాయశాఖ నుంచి ఈ-పంట, ఆన్లైన్లో రైతుల వివరాలు సేకరించిన మార్కెటింగ్శాఖ డేటా సిద్ధం చేసింది. పత్తి కొనుగోలుకు సీసీఐ మాత్రం ముందుకు రావడం లేదు. వర్షాల కారణంగా నాణ్యత లేని పత్తి మార్కెట్కు వస్తోందని చెబుతూ ప్రైవేటు వ్యాపారులు ధరలో కోత విధిస్తున్నారు.

ఒకవైపు వర్షాలు, నిల్వ చేసుకో వడానికి ఇబ్బందులు.. మరోవైపు పెట్టుబడులకు సొమ్ము అవసరమైన పరిస్థితుల్లో రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తోంది. వర్షాలకు కొంత నాణ్యత తగ్గినా క్వింటాకు కనీసం రూ. 7 వేలైనా వస్తుందని రైతులు ఆశించినా పరిస్థితులు వేరేవిధంగా ఉన్నాయి. సీసీఐ వెంటనే పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ.. పత్తి కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

# మద్యం పరిశ్రమలో సిఐడి అధికారుల సోదాలు

కుప్పం: కుప్పం పట్టణం డీకే పల్లి పరిధిలోని మద్యం పరిశ్రమలో సిఐడి అధికారులు అడిష నల్ ఎస్పీ వెంకటాద్రి నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా సంస్థలోని పలు రికార్డులను, మద్యం తయారీ పద్ధతిని పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్యం పరిశ్రమలలో సిఐడి సోదాలు ప్రారంభించారని, ఇందులో భాగంగా కుప్పం పట్టణ పరిధిలోని మద్యం పరిశ్రమలో సైతం సోదాలు చేపట్టినట్టు సమాచారం. కార్యక్రమంలో స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసు శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.గుడిపాల మండలంలోని మోహన్ బేవరేజ్ అండ్ డిస్టలరీ లిమిటెడ్ సంస్థ(ఓరియన్ ఫ్యాక్టరీ)లో సిఐడి అధికారులు సోదాలు నిర్వహించారు. ఏపీ సిఐడి డీఎస్పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ డిజి టల్ రికార్డులు, ఆఫీసు కంప్యూటర్ల రికార్డ్సను, 2019 నుండి 2024 జరిగిన లావాదేవీలను పరిశీలించారు. రా మెటీరియల్స్ అయినా స్పిరిట్, ఎంప్టీ బాటిల్స్, అట్టపెట్టలు ఎక్కడనుండి దిగుమతి చేసుకుం టున్నారు. అదేవిధంగా తయారైన మద్యాన్ని ఎక్కడికి ఎగుమతి చేస్తున్న అనే విషయాలపై సిఐడి ఆరా తీశారు. యాజమాని చెన్నైలో ఉన్నారని



ప్రస్తుతం ఇక్కడ మేనేజర్ గోపాల్ ఈ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో నడుస్తున్నాయని వారు తెలిపారు. ఇక్కడ ఓల్డ్ మంక్ రమ్, మ్యాజిక్ మూమెంట్స్ వోడ్కా, రాయలసీమ విస్కీ మూడే బ్రాండ్లు తయారు చేస్తున్నారన్నారు. గల ప్రభుత్వంలో జరిగిన మద్యం అవకతవకలపై రాష్ట్ర వ్యాప్తంగా ఈ దా డులు నిర్వహిస్తున్నట్లు డిఎస్పి తెలిపారు. ఫ్యాక్టరీలోనికి సిఐడి అధికారులు మీడియాను అనుమతించ లేదు. ఈ సోదాల్లో స్థానిక పోలీసులు, రెవిన్యూ ఇబ్బందులు ఉన్నారు.

# అర్థాంతరంగా ఆగిన పథకాలు..? పుర ప్రజలకు కష్టాలు..!



**గుత్తి,తెలంగాణ దిశ:**గుత్తి పురపాలికలో తాగునీటి సమస్య తీరడం లేదు. పురపాలికలోని గుత్తి, గుత్తిఆర్.ఎస్, చెట్నేపల్లి, సూరశింగనపల్లిలో పరిస్థితి జఠిలంగా ఉంది. ఇదివరకు నెలకోసారి నీటి2 సరఫరా జరిగేది. గుత్తి చెరువుకు హంద్రీనీవా నీరు చేరడంతో 15రోజులకోసారి గొంతులు తడుపుతున్నారు. నాలుగు నెలల కిందట వరకు పురపాలికలో ప్రజలు తాగునీటి కోసం రోడ్డెక్కారు. పోరాటం చేస్తే నీరు సరఫరా అయ్యే పరిస్థితికి వచ్చిందని పట్టణవాసులు వాపోతున్నారు. గుత్తి పరిధిలో కొత్తపేట వద్ద బోర్లు వేసి గుత్తికి సుమారు 3 కి.మీ. దూరం వరకు పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. బోర్లలో నీటి ఊట తగ్గి పథకం మూలకు చేరింది. కొన్నేళ్ల కిందట బసినేపల్లి వద్ద బోర్లు వేసి గుత్తిఆర్.ఎస్.కు తాగునీరు అందించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీనికి గాను రూ.15 లక్షలు వెచ్చించినా వృథా అయింది.చెట్నేపల్లిలో 25 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన తాగునీటి పథకం ప్రారంభానికి ముందే మూలనపడింది. ఫలితంగా నీటి కష్టాలు తప్పలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అంటున్నారు. ఇప్పటికే గుత్తిచెరువుకు హంద్రీనీవా నీటిని నింపామన్నారు. బోర్లలో నీటి లభ్యత మెరుగుతోందని, రూ.173 కోట్లతో తాగునీటి పథకాన్ని పూర్తి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే పురపాలికశాఖ మంత్రి నారాయణతో పథకం పూర్తికి చర్చించామని, అసెంబ్లీ సమావేశాల్లో పథకం అమలుకు మంత్రితో మరోమారు మాట్లాడతామన్నారు. పథకాన్ని గతంలో తెదేపా ప్రభుత్వం మంజూరు చేయగా వైకాపా ప్రభుత్వం మూలనపడేసింది. ఆ పనులను తిరిగి ప్రారంభిస్తామన్నారు. సజ్జలదిన్నె వద్ద అసంపూర్తిగా.. తాడిపత్రి, తాడిపత్రి పట్టణం న్యూస్‌టుడే: తాడిపత్రి పుర ప్రజలకు రోజూ తాగునీరు అందించేందుకు అమృత్ పథకం ద్వారా గండికోట నుంచి పైపులైన్‌ఏర్పాటుకు 2017లో రూ.145కోట్లు మంజూరు చేశారు. ప్రభుత్వం మారి వైకాపా అధికారంలోకి రావడంతో ఐదేళ్లపాటు బిల్లులు రాలేదని పనులు ఆపేశారు. ప్రజలకు రోజూ తాగునీరు అందించాలనే లక్ష్యం ఆగిపోయింది. తాడిపత్రి వాసులకు రెండు రోజులకోసారి గంట సమయం తాగునీటిని సరఫరా చేస్తున్నారు. వేసవిలో అయితే మూడు, నాలుగు రోజులకోసారి నీటి సరఫరా జరుగుతుంది. ప్రస్తుతం పెన్నానదిలో ఉన్న 23 బోరుబావులే ప్రధాన నీటి వనరు. వేసవిలో ఆ బోరుబావులు ఎండిపోతే తాగునీటి ఎద్దడితోఇబ్బందులు పడాల్సి వస్తోంది. వైకాపా ప్రభుత్వం అధికారంలోఉన్న ఐదేళ్ల పాటు నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడం తో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. అమృత్ పథకం పూర్తయితే గండికోట నుంచి వచ్చే నీటిని నిత్యం ప్రజలకు అందించొచ్చు.

# వేదవతి హగరి ఉగ్రరూపం



**బొమ్మనహాళ్,తెలంగాణ దిశ:** కర్ణాటక ప్రాంతంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు జలాశయాలు పూర్తిగా నిండటంతో గేట్లను ఎత్తివేశారు. దీంతో వేదవతి చిన్న, పెద్ద హగరి నదులు ఉగ్రరూ2పం దాల్చాయి. కర్ణాటకలోని మొలకాల్మూరు తాలూకాలోని రంగయ్యగుడ్డద జలాశయం గేట్లను ఎత్తడంతో వేదవతి చిన్న హగరికి నీటి మట్టం పెరుగుతోంది. బీటీపీ గేట్లను ఎత్తడంతో వేదవతి పెద్ద హగరికి నీరు చేరి, రెండు నదులు బొమ్మనహాళ్ మండలం సంగమేశ్వరాలయం వద్ద కూడలిలో కలిశాయి. దీంతో కల్లుదేవనహళ్లి వద్ద వేదవతి హగరి ఉగ్రరూపం దాల్చింది. వివిధ రకాల పంటలు మునిగి కోట్లాది రూపాయులు నష్టం వాటిల్లింది. హగరి పరివాహక గ్రామాలైన బొల్లనగుడ్డం, హరేసముద్రం, శింగానహళ్లి, బండూరు, గౌనూరులో వరదనీరు గ్రామాల్లోకి వస్తాయోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వరద తాకిడికి విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు, పైపులైన్‌లు కొట్టుకుపోవడంతో తాగు, సాగు నీటికి కష్టాలు ఏర్పడ్డాయి. వెంటనే ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగు, సాగునీరు అందించాలని, అధికారులు నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చూడాలని కోరుతున్నారు.

## రెండేళ్లు.. ఒక్క కి.మీ తిరగలె

# కొత్త అంబులెన్స్‌కు డ్రైవర్ లేరంట?

**అనంతపురం,తెలంగాణ దిశ:**ఎక్కడో మారుమూల ప్రాంతంలో అంబులెన్స్‌ను తిప్పకుండాఒకేచోట ఉంచారంటే అధికారుల పర్యవేక్షణ కొరవడి అలా జరిగిందని అనుకోవచ్చు. జిల్లా కేంద్రంలో రోజూ అధికారి వచ్చిపోయే కార్యాలయం ముందే ఉన్న అంబులెన్స్‌ను రెండేళ్లుగా వృథాగా ఉంచారంటే డీసీహెచ్ఎస్ అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రెండేళ్ల క్రితం అనంతపురం డీసీహెచ్ఎస్ కార్యాలయానికి ఓ అంబులెన్స్‌ను కేటాయించారు. ఇది జిల్లా కేంద్రానికి వచ్చినప్పటి నుంచి డీసీహెచ్ఎస్ ప్రధాన కార్యాలయం ఎదుట నిలిపి ఉంచారు. ఇప్పటివరకు ఒక్క రోగిని అందులో తరలించలేదు. నిలిపిన చోట నుంచి కనీసం వాహనాన్ని పక్కకు పెట్టిన పాపాన పోలేదు. రోజూ డీసీహెచ్ఎస్ అధికారి ఈ వాహనం ముందు నుంచే కార్యాలయంలోకి వెళుతున్నా ఏనాడు పట్టించుకోలేదు. సర్వజన వైద్యశాల నుంచి సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రికి పలువురు రోగులను వైద్యులు రెఫర్ చేస్తుంటారు. అలాంటి వారిని తరలించేందుకు వినియోగించే అవకాశం ఉన్నా దృష్టి పెట్టలేదు. సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలో ఎంఆర్ఐ పరీక్ష అందు బాటులో లేకపోవటంతో వైద్యులు




సర్వజన వైద్యశాలకు రోగులను పంపుతుంటారు. ఇలా రోజువారీగా 20కి పైగా కేసులు ఉంటాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారిని తరలించడానికి అంబులెన్స్‌ను వినియోగించినా ప్రజాధనానికి సార్థకత చేకూరేది. రూ.లక్షల విలువైన వాహనం నిరుపయోగంగా మారిన వైనంపై డీసీహెచ్ఎస్ అధికారి పాల్ రవికుమార్ దృష్టికి తీసుకెళ్లగా డ్రైవర్ లేక వినియోగించడం లేదని చెప్పటం గమనార్హం.

# అధినేత ఆదేశించినా.. ఆగని అక్రమ రవాణా



**తిరుపతి,తెలంగాణ దిశ:** సొంత అవసరాలకు ట్రాక్టర్లు, ఎద్దులబండి ద్వారా ఇసుకను ఎక్కడైనా తవ్వుకోవచ్చు. దీని ముసుగులో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. ముఖ్యంగా ఇసుక తవ్వకాల్లో నేతలు, అధికారులు జోక్యం చేసుకుంటే ఉపేక్షించేది లేదని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినా.. ఏర్పేడు మండలంలో ఇసుకాసు రుల తీరు మారడం లేదు. ప్రభుత్వ ఆదేశాలతో మాకు పనేంటి అనే తీరుగా వ్యవహరిస్తున్నారు. కొందరు వ్యక్తులు కొత్తవీరాపురం సమీపంలోని నదిలో .హిటాచీతో ఇసుక తవ్వి పెద్దఎత్తున నిల్వ చేస్తుండగా మరో పొక్లెయిన్ ట్రాక్టర్లకు నింపుతోంది. ఈ తంతు వారం రోజులుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రజలందరికీ ఇసుక అందుబాటులోకి తీసుకు రావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టింది. అయితే దీన్ని కొందరు అక్రమా ర్కులు అనుకూలంగా మార్చుకుని సిరులు ఆర్జిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొత్తవీరాపురం సమీపంలో సొంత కూలీలతో ట్రాక్టర్‌కు అవసరమైన ఇసుక తవ్వుకుంటే రూ.700, అక్కడ అందుబాటులో ఉన్న పొక్లెయిన్‌తో ట్రాక్టర్‌కి ఇసుక పోస్తే రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. సొంత అవసరాల కోసం ప్రభుత్వ నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలు చేపట్టాలి. ఇసుక వ్యాపారం చేస్తూ నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవు.

# కాటన్ ఆనకట్ట వద్ద యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

**రాజమహేంద్రవరం,తెలంగాణ దిశ:**జాతీయ హరిత ట్రైబ్యునల్ ఆదేశాల మేరకు నదిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేయకూడదు.. రివర్ కన్జర్వేటర్ చట్ట ప్రకారం నదిలో కట్టడానికి 500 మీటర్లకు దూరంలో తవ్వకాలు నిషేధం.. ఈ నిబంధనలు ఎక్కడా అమలుకావడంలేదు. ధవళేశ్వరం కాటన్ ఆనకట్టకు ఆనుకుని ఆత్రేయపురం మండలం బొబ్బర్లంకలో వేకువజాము నుంచి ఉదయం 8.30 గంటల వరకు జేసీబీతో ఇసుక తవ్వకాలు చేపట్టారు. పైగా నీటి మళ్లింపు పనులు చేపట్టారు. కొందరు వ్యక్తులు నదిలో టెంట్ వేసుకుని ఈ తవ్వకాలను పర్యవేక్షించారు. ఇసుక తవ్వి తరలించేందుకు వీలుగానే నీటి మళ్లింపు ప్రక్రియ చేపట్టినట్లు తెలుస్తోంది. బ్యారేజీ స్కవర్ స్లూయిజ్ తదితర చోట్ల రేయింబవళ్లు తవ్వకాలు సాగుతున్నా యి. రోజుకు 30 లారీల వరకు ఇసుక సరిహద్దులు దాటిపోతోంది. రాజవరం, వెలిచేరు తదితర చోట్ల లంక మట్టి తవ్వకాలు రాత్రి 10 గంటల తర్వాత ప్రారంభించి వేకువజామున 4 వరకు కొనసాగిస్తున్నారు. భారీ వాహనాలు ఆనకట్టపైకి



వెళ్లకూడదన్న నిబంధన ఉన్నా పట్టడం లేదు. గస్తీ బృందం, లస్కర్లు ఉన్నా అడ్డగోలు తవ్వకాలను నియంత్రించలేదు. బ్యారేజీ వద్ద జేసీబీతో నీటి మళ్లింపు పనులు చేయడంపై హెడ్ వర్క్స్ ఈఈ కాశీవిశ్వేశ్వరరావు వద్ద ప్రస్తావించగా తమ దృష్టికి విషయం వచ్చిందని, టాస్క్‌ఫోర్స్ అధికారులు అడ్డుకున్నట్లు కింది స్థాయి సిబ్బంది తెలిపారన్నారు.

## ఐదేళ్లూ అసంపూర్తిగా కేవీకే నిర్మాణాలు

# కూటమి రాకతో పనుల్లో కదలిక

**తిరుపతి,తెలంగాణ దిశ:** గ్రామీణ యువతకు చదువుతోపాటు క్రీడలను దరిచేర్చే లక్ష్యంతో తలపెట్టిన క్రీడా వికాస కేంద్రాల (కేవీకే) నిర్మాణాల్లో మళ్లీ కదలిక మొదలైంది. 2014-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం వాటిని మంజూరు చేసి అవసరమైన నిధులు కేటాయించింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసింది. ఐదేళ్లలో ఒక్కటీ అందుబాటులోకి తేకపోగా ఉన్నవాటినీ వదిలేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకుగాను మూడు క్రీడా వికాస కేంద్రాలు (కేవీకే) మంజూరయ్యాయి. రూ.2.10 కోట్ల నిధులతో ఇండోర్ స్టేడియం, 200 మీ. రన్నింగ్ ట్రాక్, మైదానం, యోగా, జిమ్ కేంద్రాల ఏర్పాటుతోపాటు ఆదాయం వచ్చేలా వాణిజ్య దుకాణాల నిర్మాణం తలపెట్టారు. పట్టణానికి కి.మీ. దూరంలో కేవీకేను నిర్మించారు. తమిళనాడు, ఆంధ్ర సరిహద్దు ప్రాంతం లో ఉండటం, అక్కడి యువతకు క్రీడలపై అవగాహన లోపం కారణంగా నిరుపయోగంగా ఉంది. ఇటీవల బాధ్యతలు చేపట్టిన శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎండీ గిరీష ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కేవీకేలో ఆటలాడించేలా త్వరలో ఆదేశాలు జారీ చేయనున్నట్లు సమాచారం. పునర్విభజనలో భాగంగా నెల్లూరు జిల్లా పరిధిలోని సూళ్లూరుపేట నియోజకవర్గం తిరుపతి పరిధిలోకి వచ్చింది. సూళ్లూరుపేట పట్టణంలో కేవీకే నిర్మాణం పునాదుల దశలోనే నిలిచిపోయింది. పట్టణంలోని కేవీకేలో మరమ్మతులకు గురైన వాటిని ఇటీవల బాగుచేయించారు. ఇండోర్ మైదానంలో ఉడెన్ కోర్టు



అందుబాటులో తెచ్చారు. కమర్షియల్ దుకాణాల నుంచి రూ.3వేల చొప్పున నెలనెలా అద్దె, డిపాజిట్ల రూపంలో రూ.1.80 లక్షలు వసూలు చేశారు. పర్యవేక్షకుడు (సెక్యూరిటీ) లేకపోవడంతో మందు బాబులు, ఆకతాయిలు అద్దాలు, తలుపులు ధ్వంసం చేస్తున్నారు.

పట్టణంలో 2018లో రూ.2 కోట్లతో కేవీకే నిర్మాణం చేపట్టారు. ఏడాదిలో రూ.67 లక్షల వరకు ఖర్చుచేసి 45% పనులు పూర్తిచేశారు. తర్వాత అధికారంలో వచ్చిన వైకాపా పనులను గాలికి వదిలేసింది. ఇటీవల ఇంజినీరింగ్ అధికారులు పూర్తి చేయాల్సిన పనులకు అంచనాలను వేసి నివేదిక అందించారు. త్వరలో పనులు పూర్తి చేసి అందుబాటులో తీసుకొచ్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న కేవీకేలపై ప్రత్యేక దృష్టి సారించాం.

# వైకాపా పాపం.. ప్రభుత్వ బడులకు శాపం




చిత్తూరు: 'ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు పది శాతం తక్కువగా ఉంటున్నాయి.. మొత్తం విద్యార్థుల్లో 45 శాతం మంది మాత్రమే ఇక్కడ చదువుతున్నారు.. హాజరు కూడా 70 శాతమే ఉంటోంది' అని పూతలపట్టు మండలం ఆకనంబట్టులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీల సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆవేదన ఇది. దీనంతటికీ వైకాపా హయాంలో తెచ్చిన సంస్కరణలే కారణమని చెప్పవచ్చు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం తలాతోకా లేని సంస్కరణలు తీసుకురావడం.. అవి వికటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్దగా ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్చేందుకు ఆసక్తి చూపలేదన్నది స్పష్టం. ఆ ప్రభావంతోనే ఈ విద్యా సంవత్సరంలోనూ ప్రవేశాల జోరు తగ్గింది. జగన్ పాలనలో జరిగిన తప్పిదాలను కూటమి పాలనలోనైనా సరిదిద్దితే సర్కార్ బడులకు మహర్దశ వస్తుంది. జాతీయ నూతన విద్యా విధానంలో భాగంగా పాఠశాలల విలీనం చేపడుతున్నామని గత వైకాపా ప్రభుత్వం ప్రకటించింది. ఉపాధ్యాయులు, బడుల సంఖ్యను తగ్గించేందుకు గత పాలకులు 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులు కిలోమీటరు దూరంలోని బడులకు వెళ్లాల్సి వచ్చింది. ఈ సంస్కరణలను నిరసిస్తూ తల్లిదండ్రులు, చిన్నారులు రోడ్డెక్కినా జగన్ ప్రభుత్వం మాత్రం స్పందించలేదు. పాలసముద్రం, గంగవరం, బైరెడ్డిపల్లె, కుప్పం తదితర మండలాల్లో వారం- 10 రోజులపాటు ఆందోళనలు చేసినా నాటి పాలకులు ఒక్క మెట్టు కూడా దిగిరాలేదు. అనివార్య పరిస్థితుల్లో తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చేర్చేందుకు మొగ్గు చూపారు. ఫలితంగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గాయి. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల హేతుబద్ధీకరణకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జీవో 117ను తెచ్చి అస్తవ్యస్త విధానాలు అమలు చేసింది. దీన్ని అమలు చేస్తే ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ బడులుగా మారుతాయని ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదు. ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఖ్య తగ్గుతుందని హెచ్చరించినా లెక్క చేయలేదు. ఇలా ఐదేళ్లలో విద్యాశాఖను భ్రష్టు పట్టించారు. 2021-22లో ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో కలిపి 1,84,138 మంది విద్యార్థులు చేరారు. తర్వాత విద్యా సంవత్సరంలో ఏకంగా 13,156 ప్రవేశాలు తగ్గాయి. దీంతో 1,70,982 మాత్రమే చేరారు. 2023- 24లో పరిస్థితి మరింత దిగజారి 1,54,191గా విద్యార్థుల సంఖ్య నమోదైంది. అప్పటి ప్రభావంతో ప్రస్తుత విద్యా సంవత్సరంలోనూ 1,50,120 ప్రవేశాలు ఉన్నాయి. మూడేళ్లుగా ఇలా చిన్నారుల సంఖ్య దిగజారుతూనే ఉంది. ఐదేళ్లలోని లోటుపాట్లను ఒకొక్కటిగా సరిదిద్దితేనే ప్రభుత్వ పాఠశాలలు గాడిలో పడతాయి.

# నీటి చుక్కను ఒడిసిపడదాం..!

**తాళ్లపూడి,తెలంగాణ దిశ:** జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లోని మెట్ట ప్రాంతాలైన తొమ్మిది మండలాల్లో ఇంకుడు గుంతలు తవ్వాలని ఉన్నతస్థాయి అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. వీటిలో తాళ్లపూడి, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం, రంగంపేట, రాజానగరం, కోరుకొండ, గోక వరం, సీతానగరం.. ఇలా 9 మండలాల్లో ఇంకుడుగుంతలు తవ్వకానికి చర్యలు చేపట్టింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఒక్కో మండలానికి వెయ్యి చొప్పున ఇంకుడు గుంతల తవ్వకానికి ఇటీవల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఒక్కో గుంత పొడవు, వెడల్పు 1.20 మీటర్లు ఉండాలని నమూనా ఆకృతిని సైతం పంపించారు. ఎన్ని సెం. మీ. పెద్ద, చిన్న కంకరాళ్లు ఎలా వాడాలో సూచించారు. ఇందుకోసం పనులు చేసిన కూలీల వేతనాలకు రూ.550, సామగ్రి కొనుగోలుకు రూ.5,450 ఖర్చు చేయాలని అనుమతిచ్చారు. జిల్లా వ్యాప్తంగా చూస్తే ఒక్కో మండలానికి వెయ్యి చొప్పున తొమ్మిది మండలాల్లో 9 వేలు ఇంకుడుగుంతలను తవ్వాలి. ఈ లెక్కన చూస్తే ఒక్కో గుంతకు ఖర్చు రూ.6 వేల చొప్పున లెక్కకడితే రూ.5.40 కోట్ల పరిపాలన అనుమతులు వచ్చాయి. ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఏపీవో, ఏపీడీ, ఎంపీడీవోలు, ప్రణాళికను సిద్ధం చేసి వెంటనే పనులకు శ్రీకారం చుట్టాలని ఆదేశించారు. 2014-19లో అప్పటి తెదేపా హయాంలో ఇంకుడు గుంతల తవ్వకం కార్యక్రమాన్ని ప్రభుత్వం యజ్ఞంలా చేపట్టింది. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం




గత ఐదేళ్ల కాలంలో నీటి సంరక్షణకు మంగళం పాడేసింది.భూగర్భ జలాలను సంరక్షించే విధానంపై కన్నెత్తి చూడలేదు. తాజాగా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇంకుడుగుంతల తవ్వకానికి శ్రీకారం చుట్టింది. ఎక్కడా నీటి చుక్క వృథాగా పోకుండా భూగర్భ జలాలు కళకళలాడేలా చూడాలని ఆదేశించింది. మురుగునీరు దుర్వాసన రాకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని తెలిపింది. వాన నీటిని ఒడిసిపట్టేందుకు ప్రతి ఒక్కరూ భగీరథుడిగా పని చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. వీధుల్లో నీరు ఎక్కువగా నిలిచే ప్రదేశాలను గుర్తించి ఇంకుడు గుంతలను తవ్వించాలని ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు వచ్చాయి. మురుగునీరు ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ పనులు చేపట్టాలన్నారు.

# స్నేహపూర్వకంగా సేవలు అందించండి

**ఆనందపురం,తెలంగాణ దిశ:** ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పించేలా ఇబ్బంది పెట్టకుండా స్నేహపూర్వక వాతావరణంలో వారి సమస్యలను పరిష్కరించి, సేవలందించాలని రెవెన్యూ సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా, నిజాయితీగా పనిచేయాలని హితవు పలికారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో భీమిలి రెవెన్యూ డివిజన్ సద స్సులో జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయి పరిస్థితులపై పూర్తిగా అవగాహన పెంచుకొని విధులు నిర్వర్తించాలన్నారు. అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి, వాటి పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణలో లోప భూయిష్టం, సమస్యలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. తద్వారా భవిష్యత్తులో పారిశ్రామిక వేత్తలు, ఐటీ పరిశ్రమల నిర్వాహకులు ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తారన్నారు. విశాఖపట్టణం మహా నగరానికి ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని రెవెన్యూ సిబ్బంది పని చేయాలని సూచించారు. నిబద్ధతతో పనిచేస్తే ఆశించిన ఫలితాలు సాధ్యమన్నారు. ప్రజలకు అత్యంత సులభతరమైన రీతిలో సేవలందించాల్సిన కనీస బాధ్యత విఆర్ఏ నుంచి కలెక్టర్ వరకు ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. తప్పు చేసి నా, నిర్లక్ష్యం చేసినా ఉపేక్షించంకుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీ, మ్యుటేషన్ ప్రక్రియ, పట్టాదారు పాసుపుస్తకాల జారీలో అవకతకలకు పాల్పడరాదని,



అలా ఎవరైనా చేస్తే ఉపేక్షించబోనని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ రెవెన్యూ సిబ్బందిని హెచ్చరించారు. రెవెన్యూ పరమైన అంశాల్లో ఏదైనా తప్పు జరిగితే తక్షణమే స్పందించాలని, అడ్డు చెప్పాలని, నివేదించాలని సూచించారు. తప్పు చేసినా, సమర్థించినా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. సమావేశంలో రీ సర్వే, మ్యుటేషన్ ప్రక్రియ, వివిధ సర్టిఫికేట్ల జారీ, భూముల ఫ్రీహోల్డ్, ప్రభుత్వ భూముల పరిరక్షణ, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, డి.నోటిఫికేషన్, ప్రజా సమస్యలపై స్పందన, క్షేత్రస్థాయి రెవెన్యూ సమస్యలు తదితర అంశాలపై మాట్లాడారు.సమావేశంలో డిఆర్ఓ కె.మోహన్‌కుమార్, పి రామారావు,పాల్‌కిరణ్, ఎం.రమేష్ డిటిలు చేతన్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి శ్రీనివాసరావు, త్రినాథ్, రాజేష్, పలువురు జిల్లా, మండల స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# రవాణా ఛార్జీలపై భరోసా



**కాకినాడ,తెలంగాణ దిశ:** ఏకీకృత శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ప్రాజెక్టుల పరిధిలో సెక్టార్లవారీగా అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించే సూ పర్‌వైజర్లకు రవాణా ఖర్చులు మంజూరు చేసేందుకు కూటమి ప్రభుత్వం సూత్రప్రాయం గా అంగీకరించడంపై వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. ఇందుకు మా ర్గదర్శకాలను రూపొందించాలని ఇటీవల కలెక్టర్ల సమావేశంలో సీఎం చెప్పడంపై ఆశాభావంతో ఉన్నారు. గత ఐదేళ్లుగా రవాణా ఛార్జీల భారంతో ఇబ్బందులు పడుతున్న సూపర్‌వైజర్లు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో 23 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లోని 5,268 అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను 206 మంది సూపర్‌వైజర్లు నిర్వహిస్తున్నారు. సెక్టారు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలను నెలకోసారి సందర్శించి చిన్నారులు, కిశోరబాలి కలు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న సేవలు, పోషణ్ అభియాన్ అమలును పరిశీలించాలి. పోషకాహారలోపం ఉన్న లబ్ధిదారుల జాబితాల ను తనిఖీ చేయాలి. పిల్లల సరైన వయసును అంచనా వేయడంలో అంగన్ వాడీ కార్యకర్తలకు మార్గనిర్దేశం చేయడం, చిన్నారుల బరువు తూకం పద్ధతులు, వారి పెరుగుదల వివరాల నమోదు దస్త్రాలను పరిశీలించి అవస రమైన సూచనలు చేయాలి. గ్రామస్థాయిలో నిర్వహించే ప్రభుత్వ కార్యక్ర మాల్లో భాగస్వాములవుతారు. బాల్యవివాహాలు జరుగుతున్న సమాచారం తెలిసిన వెంటనే అక్కడకు చేరుకుని, నిలుపుదల చేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ఒక్కో సెక్టారు పరిధిలో 20 నుంచి 30 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యమే ఉండదు. ఆటోల్లో అధిక ఛార్జీలు చెల్లించి కేంద్రాలకు చేరుకోవాల్సిన పరిస్థితి. కొన్ని పల్లెలకు వెళ్లడానికి ఆటో సదుపాయం కూడా ఉండదు. సొంతంగా ఆటో ఏర్పాటు చేసుకోవడం లేదా ద్విచక్ర వాహనంపై వెళ్లాల్సిందే. వేతనంలో 10 శాతం వరకు రవాణా ఖర్చులకు కేటాయించాల్సి వస్తోందని చెబుతున్నారు. కొరత కారణంగా అదనంగా మరో సెక్టారు పర్యవేక్షణ బాధ్యత చేపట్టిన వారికి మరింత ఖర్చవుతుంది.

# వందల్లో కార్మికులు.. విధుల్లో కనిపించరు




**కరీంనగర్,తెలంగాణ దిశ:** నగరంలోని టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డు, సప్తగిరికాలనీ ప్రాంతాల్లో రహదారులు శుభ్రంగా ఉండటంలేదు. ఎక్కడి చెత్త అక్కడే ఉంటుంది. ఫిర్యాదు చేస్తే తప్ప కార్మికులు కనిపించడం లేదు. గణేశ్‌నగర్ బైపాసు రోడ్డుకు ఇరువైపులా కొద్ది రోజులుగా ఊడవటం లేదు. ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. గతంలో మాదిరిగా శుభ్రతను పట్టించుకోవడం లేదు. కూడళ్ల చుట్టూ చెత్తా చెదారం లేకుండా శుభ్రంగా ఉంచేవారు. ఎప్పటికప్పుడు పిచ్చి మొక్కలు తొలగించేవారు. ప్రస్తుతం హరితహారం కార్మికులు తొలగించకపోగా, డివిజన్ కార్మికులు సైతం ఆవైపు చూడటం లేదు. పై ఉదాహరణలు చాలు కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ గాడి తప్పుతుంది అనడానికి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవార్డులు, ర్యాంకులు సాధించిన నగరంలో.. కొద్ది నెలలుగా అపరిశుభ్రత ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తోంది. పండగల సమయంలో అయితే రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. నగరంలో పారిశుద్ధ్య కార్మికులు డివిజన్‌కు కనీసం 10 నుంచి 12 మంది పని చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన పరిశీలిస్తే ఒక్కోచోట 8 మంది కూడా క్షేత్రస్థాయిలో ఉండటం లేదు. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లలో పనిచేస్తుండగా, మరికొందరు డివిజన్‌లలో ప్రైవేటు పనులలో నిమగ్నమవుతున్నారు. గాంధీరోడ్డులో రాత్రిపూట పనిచేసే కార్మికులే లేరు. డ్రైవర్లు, లోడర్లు లేకపోవడంతో రోజంతా పనిచేసేవారితోనే చెత్తను ఎత్తిస్తున్నారు. భూగర్భ డ్రైనేజీలు ఉన్నచోట పూడికతీసే కార్మికులు కనిపించడంలేదు. అటకెక్కిన పర్యవేక్షణ నగరంలో పారిశుద్ధ్య విభాగానికి పర్యవేక్షకులు లేకపోవడంతో ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్నారు. దీంతో పనులలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. రోజూ ఉదయం, మధ్యాహ్నం తనిఖీలు లేకపోవడంతో పనులు సక్రమంగా జరగడం లేదనే ఫిర్యాదులు అధికమయ్యాయి. డివిజన్‌లలో రహదారులకు ఇరువైపులా శుభ్రంగా ఊడవటం, ప్రతీ వీధిలోని బహిరంగ మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించడం, ప్రభుత్వ కార్యాలయాల దగ్గర పిచ్చిమొక్కలు లేకుండా చూడటంవంటి పనులు చేయాల్సి ఉండగా పట్టించుకోవడంలేదు. నగరపాలిక పనులు చేయకుండా కార్మికులను ప్రైవేటు ప్లాట్ల వద్ద శుభ్రం చేసేందుకు, అక్కడున్న చెత్తను తరలించేందుకు ట్రాక్టర్లను వినియోగిస్తుండటంతో దీని ప్రభావం పారిశుద్ధ్య పనులపై పడుతోంది. ప్రైవేటు ప్లాట్లకు జరిమానా వేసి శుభ్రం చేయాల్సి ఉండగా ఎక్కడ కూడా అలా జరగడంలేదు. డివిజన్‌లలోని అంతర్గత వీధులలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా జవాన్లతో పర్యవేక్షణ పెంచడం జరుగుతుంది. తనిఖీల సందర్భంగా నిర్లక్ష్యం కనిపిస్తే చర్యలు తీసుకుంటాం.

# చెత్త సేకరణ వాహనాల వినియోగంలో బల్దియా నిర్లక్ష్యం




**జగిత్యాల,తెలంగాణ దిశ:** జగిత్యాల పట్టణంలో 48 వార్డుల నుంచి నిత్యం 70 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నారు. వార్డుల విలీనం తరువాత గృహాలసంఖ్య పెరగటం, కాలనీలను విస్తరించడంతో చెత్త సేకరణ బల్దియాకు సవాలుగా మారింది. వాహనాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఆటోలు, ట్రాక్టర్లు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. దీంతో బల్దియా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.14 లక్షలతో ఏడాది క్రితం ట్రాక్టరును.. రెండు నెలల కింద రూ.25 లక్షలతో 4 కొత్త ఆటోలను కొనుగోలు చేశారు. వీటిని వెంటనే ప్రారంభించి వినియోగించాల్సిన అవసరం ఉన్నా.. నిర్లక్ష్యంతో పక్కన పెట్టేశారు. పురపాలిక అధికారులకు మరమ్మతులపై ఉన్న శ్రద్ధ వాహనాల నిర్వహణపై లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏడాదికి రూ.20 లక్షల చొప్పున మరమ్మతులకు వ్యయం చేస్తున్నారు. కొత్త వాహనాలు కొనుగోలు చేయాలనే డిమాండ్ రెండేళ్లుగా ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహించారు. వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడటం.. సభ్యుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో కొత్త వాహనాలు కొనుగోలు చేసినా మరమ్మతుల యావలోపడి వీటి నిర్వహణ మరిచారు. ప్రస్తుతం 15ఆటోలు మరమ్మతు కోసం నెలల తరబడి మెకానిక్ షెడ్లలో మగ్గుతున్నాయి. తరచూ కమిషనర్లు మారటం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు సిబ్బంది మరమ్మతుల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. వాహనాలు పాడైపోయాయని.. కొత్త వాహనాలు లేవనే కారణాలతో పారిశుద్ధ్య సిబ్బంది వార్డుల్లో చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించడం లేదు. మొరాయిస్తున్న వాహనాలతోనే సామర్థ్యానికి మించి చెత్త సేకరిస్తున్నామని కొందరు పారిశుద్ధ్య సిబ్బంది వాపోతున్నారు. వార్డుల్లో కనీసం వారం రోజులకోసారి కూడా చెత్త సేకరణ చేపట్టకపోవడంతో పలు కాలనీల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. తీవ్రమైన జ్వరాల బారిన ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా అధికారులు కనీసం దోమల నివారణ మందు కూడా చల్లడం లేదు.

# విదేశీ కొలువు.. స్పందన కరవు!



**ఖమ్మం,తెలంగాణ దిశ:** దుబాయ్‌లో డెలివరీ బాయ్స్‌గా పని చేయాలనుకునే ద్విచక్ర వాహన చోదకులు(బైక్ రైడర్ల)కు చాలా డిమాండ్ ఉంది. పదో తరగతి విద్యార్హత, మూడేళ్ల డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు ఉన్న 21 నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులు. ఖమ్మం జిల్లాలో ఆసక్తి ఉన్న వారి కోసం ఉపాధి కల్పన శాఖ గురువారం ఖమ్మం మోడల్ కెరీర్ సెంటర్లో దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించింది. ఆశావహులు వచ్చినప్పటికీ వీరిలో 9 మందికి మాత్రమే పాస్‌పోర్టులున్నాయి. ఇందులోనూ తుది పరిశీలన వరకు ఎందరు మిగులు తారో వేచి చూడాలి. ప్రభుత్వం టామ్‌కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో కొలువులను వెతికి, ఇక్కడి నుంచి వెళ్లేవారికోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. పూర్తి ప్రభుత్వ భద్రత, భరోసాతో అభ్యర్థులను విదేశీ కొలువులకు పంపుతున్నారు. బైక్ రైడర్లు జిల్లాలో చాలామంది ఉన్నారు. ఆహార డెలివరీ సంస్థల్లో వందల మంది పని చేస్తున్నారు. ముందుగా అవగాహన కల్పించి ఉంటే విదేశీ కొలువులకు వచ్చే వారి సంఖ్య పెరిగేదనే చర్చ ఉంది. వచ్చిన అభ్యర్థుల్లో చాలామంది విదేశాల్లో ఇలాంటి అవకాశాలు ఉన్నాయని ముందస్తు సమాచారం ఉంటే అందుకు తగిన విధంగా అన్ని సమకూర్చుకునేవాళ్లమని చెప్పారు. అన్ని అర్హతలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు పాస్‌పోర్టు కావాలంటే రాదు కదా?వారిలో కొందరు నిరాశ వ్యక్తం చేశారు. టామ్‌కామ్ సంస్థ విదేశాల్లో కొలువులు చూపిస్తోందని అంటున్నారు. అందుకు తగిన సమాచారం ఇక్కడ స్థానిక కార్యాలయంలో ఉండటం లేదని, మొత్తం హైదరాబాదులోనే.. ఇక్కడేమీ లేదని చెబుతుంటే కనీస సమాచారం మాకు అందేదెప్పుడని ఒకరిద్దరు ఆవేదన చెందారు. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి మాధవి పర్యవేక్షించారు.

# సన్నాలకే రైతులు సై..!



**ఆలేరు,తెలంగాణ దిశ:** ఉమ్మడి నల్గొండ జిల్లా రైతులు వరిలో సన్నరకాల సాగుకు ప్రా ధాన్యం ఇస్తున్నారు. మార్కెట్లో సన్న రకం బియ్యానికి మంచి ధర పలుకుతుండటం, ప్రభుత్వం రూ.500 బోనస్‌ను ప్రకటించడం కూడా ఇందుకు ఊతమిస్తోంది. ఈసారి వర్షాలు అనుకూలించకపోయినప్పటికీ చాలా మంది రైతులు సన్నరకాల నారును పోశారు. నీటి వసతులు ఉన్నచోట నాట్లు సైతం వేశారు. ఇప్పటి వరకు వర్షాలు ఆశాజనకంగా లేకపోగా కుంటలు, చెరువులు వెలవెలబోతున్నాయి. వ్యవసాయ బోర్లు ఎత్తిపోతున్నాయి. వరినాట్లకు కురుస్తాయనే ఆశతో అన్నదా తలు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఏటా వానాకాలం సీజన్లో సుమారు 13.5 లక్షలకు పైగా ఎకరాల్లో వరి సాగవుతుంది. ఈసారి మాత్రం ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో 12.4 లక్షల ఎకరాల్లో సాగవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. సన్నరకాలకు బోనస్ ప్రకటించడంతో ఎక్కువగా సన్నరకాల సాగును చేపడుతున్నారు.

# విదేశీ కొలువు.. స్పందన కరవు!



**ఖమ్మం,తెలంగాణ దిశ:** పదో తరగతి విద్యార్హత, మూడేళ్ల డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు ఉన్న 21నుంచి 40 ఏళ్లలోపు వారు అర్హులు. ఖమ్మం జిల్లాలో ఆసక్తి ఉన్న వారి కోసం ఉపాధి కల్పన శాఖ ఖమ్మం మోడల్ కెరీర్ సెంటర్లో దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించింది. ఆశావహులు వచ్చినప్పటికీ వీరిలో 9 మందికి మాత్రమే పాస్‌పోర్టులున్నాయి. ఇందులోనూ తుది పరిశీలన వరకు ఎందరు మిగులుతారో వేచి చూడాలి. ప్రభుత్వం టామ్‌కామ్ సంస్థ ద్వారా విదేశాల్లో కొలువులను వెతికి, ఇక్కడి నుంచి వెళ్లేవారికోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. పూర్తి ప్రభుత్వ భద్రత, భరోసాతో అభ్యర్థులను విదేశీ కొలువులకు పంపుతున్నారు. బైక్ రైడర్లు జిల్లాలో చాలామంది ఉన్నారు. ఆహార డెలివరీ సంస్థల్లో వందల మంది పని చేస్తున్నారు. ముందుగా అవగాహన కల్పించి ఉంటే విదేశీ కొలువులకు వచ్చే వారి సంఖ్య పెరిగేదనే చర్చ ఉంది. వచ్చిన అభ్యర్థుల్లో చాలామంది విదేశాల్లో ఇలాంటి అవకాశాలు ఉన్నాయని ముందస్తు సమాచారం ఉంటే అందుకు తగిన విధంగా అన్ని సమకూర్చుకునేవాళ్లమని చెప్పారు. అన్ని అర్హతలు ఉన్నాయి. ఇప్పటికిప్పుడు పాస్‌పోర్టు కావాలంటే రాదు కదా? అని వచ్చిన నిరాశ వ్యక్తం చేశారు. టామ్‌కామ్ సంస్థ విదేశాల్లో కొలువులు చూపిస్తోందని అంటున్నారు. అందుకు తగిన సమాచారం ఇక్కడ స్థానిక కార్యాలయంలో ఉండటం లేదని, మొత్తం హైదరాబాదులోనే.. చెబుతుంటే కనీస సమాచారం మాకు అందేదెప్పుడని ఒకరిద్దరు ఆవేదన చెందారు. దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి మాధవి పర్యవేక్షించారు.

# తెరపైకి రాష్ట్రీయ రహదారి ప్రతిపాదన



**మణుగూరు,తెలంగాణ దిశ:** బూర్గంపాడు–ఏటూరునాగారం రోడ్డును రాష్ట్రీయ రహదారిగా మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలోనే ప్రతిపాదనలు పంపి సర్వే చేసినా ప్రయత్నాలు ఫలించలేదు. కొత్తగా అంశం తెరపైకి వచ్చింది. భద్రాచలం క్రాస్‌రోడ్ నుంచి ఏటూరునాగారం వర%రి%కు సుమారు 92.9 కి.మీ రహదారిని రాష్ట్రీయ రహదారిగా మార్చనున్నారు. ప్రస్తుతం ఇది కోర్ రహదారిగా ఉంది. నాలుగు వరుసలుగా మార్చే అంశంపై ఆర్‌అండ్‌బీ శాఖ నివేదికలు పంపింది. ప్రధాన రహదారిపై రోజుకి 1,500 పైగా వాహనాలు తిరిగితే రాష్ట్రీయ రహదారిగా మార్చే అవకాశం ఉంది. బూర్గంపాడు–ఏటూరునాగారం రహదారిపై అంతకుమించి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్యాసింజర్ కార్ యూనిట్స్(పీసీయూ) 12450, కమర్షియల్ వాహనాలు 2943 తిరుగుతున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఎంతో సౌలభ్యం.. నాలుగు వరుసల రహదారిగా మార్చితే ఎంతో సౌలభ్యం ఉంటుంది. సూర్యాపేట–హైదరాబాద్ రహదారిని జాతీయ రహదారిగా మార్చటంతో, హైదరాబాద్ వెళ్లే వాహనాలు ఏటూరునాగారం మీద నుంచి కాకుండా సూర్యాపేట నుంచి వెళ్తున్నాయి. నాలుగు వరుసల రహదారిగా మార్చితే ఇతర ప్రాంతాలకు చెందిన వాహనాలు బూర్గంపాడు–ఏటూరునాగారం రహదారి మీదుగా వెళ్తాయి. దీంతో అశ్వాపురం, మణుగూరుతోపాటు మలుగు జిల్లాలోని మరికొన్ని ప్రాంతాలు అభివృద్ధి కానున్నాయి. రానున్న రోజుల్లో సీతమ్మసాగర్ ప్రాజెక్ట్‌పై పర్ణశాల వెళ్లేందుకు వంతెన నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు వరుసల రహదారి మంజూరైతే అశ్వాపురం మీదుగా పర్ణశాల వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరగనుంది. బూర్గంపాడు–ఏటూరునాగారం రహదారిని నాలుగు వరుసల రహదారిగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపాం. వాహనాల లెక్క ఇచ్చాం. గతంలో సర్వే చేసినా ఎటువంటి ముందడుగు లేదు.

## పరిశ్రమల నుంచి వెలువడుతున్నవ్యర్థపు నీరు

# గుంతల్లో నిలిచిన తీరు



**మిర్యాలగూడ,తెలంగాణ దిశ:** తెలంగాణ ప్రాంతంలో అత్యధికంగా కాలుష్యం వెలువరించే జిల్లాల్లో హైదరాబాద్ మహానగరం తర్వాత ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధానంగా ఉంది. ఇక్కడ రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోంది. సాధారణంగా కాలుష్య రేణువుల స్థాయి 2.5 మైక్రాన్లు ఉండాల్సి ఉండగా అంతకంటే 1.6 శాతం నల్గొండ జిల్లాలో ఎక్కువగా ఉన్నట్లు వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్ గతంలో నివేదించింది. ఈ పరిస్థితిని చూస్తే పెరుగుతున్న పరిశ్రమలతో కాలుష్యం తీవ్రత సైతం అదే రీతిలో పెరుగుతోందని అర్థమవుతోంది. ఆసియా ఖండంలోనే అత్యధికంగా బియ్యం పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. 14 ఏళ్ల క్రితం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నీటి, వాయు కాలుష్యం తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ పరిశ్రమల నిర్వాహకులకు మూడు రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహించారు. పరిశ్రమల్లో వ్యర్థపు నీటిశుద్ధి ట్యాంకులు నిర్మించి వదలాలని, మిల్లుల పొగగొట్టాలు 60 అడుగులకు మించి ఎత్తులో నిర్మించాలని ఆదేశించారు. బూడిద, పొట్టు గాలిలో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిమెంటు పరిశ్రమల కాలుష్యంతో గాలి, పరిసరాలు కాలుష్యం పెరిగిపోతుండగా సమస్య తీవ్రరూపం దాల్చుతుంది. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి దుర్వాసనలు వచ్చాయంటే చాలు చౌటుప్పల్ వచ్చినట్లుగా సంకేతం వస్తుంది. భరించలేని వాసనలు వెదజల్లే పరిశ్రమలు యాదాద్రి జిల్లాలో విస్తరించి ఉండగా వీటి కాలుష్యం వ్యర్థాలు ఒక్కోసారి రహస్యంగా తెచ్చి రహదారుల వెంట పోస్తున్నారు. జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులు ముక్కుమూసుకోకుండా వెళ్లలేని పరిస్థితి కాలుష్య తీవ్రతకు అద్దం పడుతోంది.

# సజావుగా పంటల డిజిటల్ సర్వే



**నల్గొండ,తెలంగాణ దిశ:** పంటల డిజిటల్ సర్వేను వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) ఉమ్మడి జిల్లాలో చేపడుతున్నారు. నెల రోజులుగా పంటల డిజిటల్ సర్వేపై కొనసాగుతున్న ప్రతిష్టంభన ముగిసింది. హైదరాబాద్‌లోని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో ఏడు రోజులు సర్వేలో పాల్గొంటామని వివరించినట్లు ఏఈవోల సంఘం నాయకులు తెలిపారు. భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయడం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంట ఉత్పత్తుల కొనుగోలు, సాగు ప్రణాళిక తదితరాలకు పంటల డిజిటల్ సర్వే అధారం కానుంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం డిజిటల్ అగ్రి మిషన్ పథకాన్ని తీసుకువచ్చింది. అమలు చేసేందుకు ఆయా రాష్ట్రాలకు నిధులు మంజూరు చేసింది. పథకంలో భాగంగా చేపట్టే పంటల సర్వేకు స్థానిక యువతను ఉపయోగించుకుని ఉపాధి కల్పించాలని సూచించింది. వివిధ రాష్ట్రాల్లో ఇదే విధానం అమలవుతోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోల ద్వారా సర్వే చేయించాలని చూస్తుండటంతో సమస్య ఉత్పన్నమైంది. ఒక్కో క్లస్టర్ పరిధిలో వేల ఎకరాల భూమి సాగవుతోందని, సహాయకులు లేకుండా సర్వే చేయడం సాధ్యం కాదని ఏఈవోలు చెప్పడంతో ప్రతిష్టంభన కొనసాగింది. పనిభారం ఎక్కువవుతోందని, డిజిటల్ సర్వే చేయలేమని ఏఈవోలు ప్రభుత్వానికి చెబుతున్నారు.

# శానిటేషన్.. ప్లాంటేషన్ పై ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి



**నల్గొండ,తెలంగాణ దిశ:** శానిటేషన్, ప్లాంటేషన్ పై మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా రెండు గ్రామపంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేసి శానిటేషన్, ప్లాంటేషన్ చూడాలని, అలాగే శానిటేషన్ లో భాగంగా ఫాగింగ్, స్ప్రేయింగ్, తాగునీటిని పర్యవేక్షించాలని అలాగే ఆశ, ఏనం ఏఎన్ఎం లతో ఫీవర్ కేసులపై సమీక్షించాలని తెలిపారు. ప్రతి ఇంట్లో దోమతెరలు వాడుతున్నది లేనిది తనిఖీ చేయాలని, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, రహదారులకు ఇరువైపులా, అన్ని ప్రభుత్వ సంస్థలలో మొక్కలు నాటింది లేనిది తనిఖీ చేయాలన్నారు. డిపిఓ ఇకపై ఎంపీఓల హాజరును పర్యవేక్షించాలని, గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉదయం ఏడు గంటలకి గ్రామాలలో ఉండాలని చెప్పారు. 10 ఇళ్లల్లో జ్వరాలపై శాంపిల్ సర్వే నిర్వహించాలన్నారు. ఇకపై ప్రతివారం 2 మున్సిపాలిటీలపై సమీక్షిస్తానని తాగునీరు, శానిటేషన్, పురోగతిలో ఉన్న పనులపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. హాస్టల్లలో విద్యార్థులకు తాగునీరు, భోజనం, టాయిలెట్స్ వాటన్నిటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, వైద్యాధికారులు ప్రతినెల తప్పనిసరిగా హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించాలని చెప్పారు. ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలని, రాష్ట్రస్థాయి ప్రజావాణి దరఖాస్తులు 91 పెండింగ్లో ఉన్నాయని వాటి సైతం పరిష్కారం చేయాలని ఆదేశించారు.

# వైద్య రంగంలో సరికొత్త చరిత్ర

## బ్రెయిన్ డెడ్ వ్యక్తికి పంది లివర్ మార్పిడి
## చైనా వైద్యుల సర్జరీ సక్సెస్
## అద్భుతంగా పని చేస్తున్న లివర్



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** వైద్యరంగ చరిత్రలోనే సరికొత్త అధ్యయం లిఖించారు చైనా డాక్టర్ల. లివర్ మార్పిడి ఆపరేషన్‌ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేసి.. మనిషికి పంది లివర్‌ను అమర్చారు. మరోవిశేషం ఏంటంటే.. మనిషికి అమర్చిన ఆలివర్ ఎంతో బాగా పనిచేస్తోంది. పంది లివర్‌ను మనిషికి పెట్టడం అనేది ప్రపంచంలోనే ఇదే తొలిసారి. గతంలో అమెరికాలో పంది గుండె, కిడ్నీలను మనుషులకు అమర్చారు కానీ, లివర్‌ను మార్పిడి చేయడం ఇదే ఫస్ట్ టైమ్‌ను. ఈ ఘనతను చైనా వైద్యులు సాధించారు.అయితే.. ఈ ప్రయోగాన్ని ఒక బ్రెయిన్ డెడ్ పేషెంట్‌పై చేశారు. అలాగే లివర్‌ను దానం చేసిన పంది సాధారణ పంది కాదు. దానిలో ముందుగానే జన్యుపరంగా కొన్ని మార్పులు చేశారు. ఆ తర్వాత దాని నుంచి లివర్ తీసి.. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తికి అమర్చారు. పది రోజుల పర్యవేక్షణ తర్వాత ఆ లివర్ బాగానే పనిచేస్తోంది అంటూ వైద్యులు ప్రకటించారు.చైనా లోని ఫోర్త్ మిలిటరీ మెడికల్ యూనివర్సిటీకి చెందిన కై-షాన్ టావో, జావో-జు యాంగ్, జువాన్ జాంగ్, హాంగ్-టావో జాంగ్ నేతృత్వంలోని వైద్యుల బృందం ఈ ఆపరేషన్ చేశారు. "జీన్-మోడిఫైడ్ పిగ్-టు-హ్యూమన్ లివర్ జెనోట్రాన్స్ప్లాంటేషన్" అనే శీర్షికతో ఈ అధ్యయనం నేచర్ జర్నల్‌లో ప్రచురితమైంది. "ఈ అధ్యయనంలో కఠినమైన పర్యవేక్షణలో, మేము ఆరు జన్యువులు సవరించిన పంది నుండి బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తికి కాలేయాన్ని జెనోట్రాన్స్ప్లాంట్ చేశాం" అని వైద్యులు ఆ జర్నల్‌లో పేర్కొన్నారు. అయితే ఈ శస్త్రచికిత్స అధికారికంగా మార్చి 10, 2024న జరిగింది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యుల అంగీకారం తో వైద్యులు ఈ ఆపరేషన్ చేపట్టారు. ఆపరేషన్ పూర్తి అయిన తర్వాత ఓపది రోజుల పాటు మనిషిలో ఆ లివర్ ఎలా పనిచేస్తోంది,రక్తం ప్రవాహం,పిత్త ఉత్పత్తి, రోగనిరోధక ప్రతిస్పందన, ఇతర కీలక విధులను పర్యవేక్షించారు. కొన్ని సార్లు మనిషిశరీరం ఇలాంటి ఇతర జీవాల అవయవాలను తిరస్కరించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం పంది లివర్ అద్భుతంగా పనిచేస్తోందని, పది రోజులు పర్యవేక్షణ తర్వాత వైద్యులు ధృవీకరించారు. అలాగే కీలకమైన ప్రోటీన్ అల్బుమిన్‌ను ఉత్పత్తి చేసిందని జియాన్ వైద్యులు వెల్లడించారు. సమస్యతో బాధపడుతున్న వారికి ఇదిభారీ ఊరటను ఇచ్చే అంశమని వైద్యులు అంటున్నారు. లివర్ మార్పిడి ఆపరేషన్ కోసం ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది ఎదురుచూస్తున్నారని,కానీ, వారికి దాతలు దొరకడం లేదని, ఒక వేళఈ ప్రయోగం పూర్తి స్థాయిలో సక్సెస్ అయితే.. భవిష్యత్తులో జన్యుపరంగా కొన్ని మార్పులు చేసిన పంది లివర్‌ను మనుషులకు అమర్చే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు.

# తెర మీదకు ఎఫ్ ఎస్ ఐ స్కామ్..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** వందల కోట్ల రూపాయల్లో ఉంటే? అప్పట్లో మున్సి పల్ శాఖ మంత్రి అయిన కేటీఆర్, కెసిఆర్ క్యాబినెట్లో మంత్రులు, రియల్ ఎస్టేట్ బిల్డర్లు ఎన్ని వేల కోట్లు ఈ ఎఫ్ ఎస్ ఐ స్కామ్ లో వెనకేశారో అర్థం చేసుకోవచ్చు.10 ఫ్లోర్స్ కట్టాల్సిన చోట..50 ఫ్లోర్లు కడితే వేల మంది జనం ఒకే చోట పోగుబడిపోతే?. వాళ్లకు సౌకర్యాలు ఇవ్వడానికి ఎంత ఇబ్బంది అవుతుంది. ఇవేమీ ఆలోచిం చకుండా కేవలం డబ్బులు దండుకోడానికే అప్పట్లో ఎఫ్ ఎస్ ఐ నిబంధనలను సడలించేసి హైదరాబాద్ మొత్తం టవర్లతో వేశారు కేటీఆర్ అండ్ టీం ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్. ఎకరానికి ఎన్ని అంతస్తులు కట్టాలి ఎంత నిర్మాణం చేపట్టాలి అన్నదే ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ ఎఫ్ ఎస్ ఐ.దీన్ని అక్కడ ఉన్న మౌలిక సదుపాయాలు, మంచినీటి వసతి, శానిటేషన్ సౌకర్యాలు, రోడ్ల విస్తీర్ణాన్ని బట్టి ఎన్ని ఫ్లోర్లు కట్టాలో నిర్ణయిస్తారు. 2006లో అప్పటి వైఎస్సార్ సర్కార్ జీవో నెంబర్ 86 తీసుకొచ్చింది. ఈజీవో ద్వారా ఎవరుఎన్ని ఫ్లోర్లైనాకట్టు పోవడా నికి అనుమతిస్తూ అపరిమిత ఎఫ్ ఎస్ ఐ తెచ్చారు. ఆ తర్వాత 2012లో ఆ జీవోకి కొన్ని సవరణలు చేశారు. మీటర్ ఎత్తు నుంచి 55 మీటర్ల హైట్ వరకు 16 మీటర్ల సెట్ బ్యాక్ వదలాలి అనే నిబంధన ఉంది. అయితే 55 మీటర్లు దాటిన తర్వాత పెరిగే ప్రతి ఐదు మీటర్లకు అదనంగా అర మీటర్ సెట్ బ్యాక్ వదలాలి అనే నిబంధనని పొందుపరిచారు, అంటే 55 మీటర్ల కంటే ఎత్తులో అపార్ట్మెంట్‌ని కట్టాల్సి వస్తే కింద అర మీటర్ చొప్పున సెట్ బ్యాక్ వదలాల్సి ఉంటుంది. అప్పట్లో బిల్డర్లకి దీనివల్ల పెద్ద నష్టపోయేదేమీ లేదు. కారణం రెండు శాతం మినహా ఎక్కువమంది బిల్డర్లు ఇరవై అంతస్తులు లోపే అపార్ట్మెంట్లు నిర్మించేవాళ్లు.2019 నాటికి బి ఆర్ఎస్ ప్రభుత్వం?. కేటీఆర్ సారథ్యంలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా రియల్ ఎస్టేట్ బిల్డర్స్ చేతిలోకి వెళ్ళిపోయింది. ప్రభుత్వం చేయాల్సిన మున్సిపల్ చట్టాలను రియల్ ఎస్టేట్ బిల్డర్లే రూపొందించే స్థాయికిదిగజారి పోయింది అప్పటిబి ఆర్ ఎస్ ప్రభుత్వం.55 మీటర్ల ఎత్తుకు మించి నిర్మించే టవర్లకు అదనంగా వదలాల్సిన 0.5 మీటర్స్ సెట్ బ్యాక్ నిబంధన తొలగించారు కేటీఆర్. ఈ నిబంధన తొలగింపు వెనుక అప్పట్లో రియల్ ఎస్టేట్ కంపెనీల లాబీయింగ్ బలంగా పనిచేసింది. సెట్ బ్యాక్ నిబంధనలను తొలగిస్తూ?. అన్ లిమిటెడ్ ఫ్లోర్స్ కట్టుకోవచ్చు అంటూ కేటీఆర్ తీసుకొచ్చిన జీవో నెంబర్ 50, రియల్ ఎస్టేట్ బిల్డర్లకు వరంగా మారింది ,వేల కోట్లు కురిపించింది. ఈ అన్లిమిటెడ్ ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ కి తోడు సెట్ బ్యాక్ రూలు లేకపోవడంతో ఎకరాకి లక్షన్నర చదరపు అడుగుల కన్స్ట్రక్షన్ కి బదులు 4.5 లక్షల స్క్వేర్ ఫీట్ నిర్మాణాలు చేశారు. కొందరు ఎకరానికి ఆరు లక్షల స్క్వేర్ ఫీట్ నిర్మాణాలు కూడా చేస్తున్నారు.40 అంతస్తులు?.50 అంతస్తులు ఇష్టం వచ్చినట్టు నిర్మిస్తున్నారు. పార్కింగ్ సౌకర్యం ఉందా లేదా అనేది చూడడం లేదు. శానిటేషన్ ఉందా లేదా ? అని పట్టించుకోవడం లేదు. అసలు గ్రౌండ్ వాటర్ దొరుకుతుందా లేదా. ఎకరం భూమిలో ఆరు లక్షల ఎస్ ఎఫ్ టి నిర్మాణాలు చేస్తే.. అందులో నివసించే వాళ్ళ మురుగు అంత ఎటు వెళ్తుంది వాళ్ల కార్లు ఒకేసారి రోడ్డు మీదకు వస్తే పరిస్థితి ఏంటి? ఇవేమీ పట్టించుకునే నాధుడు లేడు? మై హోమ్, రాజ పుష్ప, అపర్ణ, వంశీరాం బిల్డర్స్, వర్టిక్స్, అరబిందో, వాసవి , అలేఖ్య ఇలా ఒకరేంటి బడా రియల్ ఎస్టేట్ బిల్డర్లు అందరూ కూడబలుక్కుని కేటీఆర్ సహకారంతో హైదరాబాదును ముంచేశారు. అడ్డగోలుగా నిర్మాణాలు చేసి. ఈరోజు సిటీ ట్రాఫిక్ నరకంతో అల్లాడిపోవడానికి పరోక్షంగా కారణమయ్యారు. హైదరాబాద్ కి సముద్రం లేదు.360 డిగ్రీస్ లో కావలసినంత భూమి ఉంది. హారిజంటల్ గా 120 కిలోమీటర్ల వరకు నగరం ఇంకా తిరగవచ్చు. ఎదగొచ్చు.ఔటర్ రింగ్ రోడ్డు చుట్టుపక్కల భూముల్లోనే ఇప్పటివరకు నిర్మాణాలు ఇంకా రాలేదు. ఇప్పుడు రీజనల్ రింగ్ రోడ్డు కూడా వచ్చేసింది. హెచ్ఎండిఏ పరిధి చాలా పెరిగింది. ఇంత భూమి పెట్టుకుని మొత్తం సిటీలోనే కిక్కిరిసిపోయేటట్లు 50?. 60 ఫ్లోర్లు కట్టేస్తే?. జనం అంతా ఒకే చోట పోగుపడి నీళ్లు లేక, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక, నిత్యం ట్రాఫిక్ తో నరకం చూస్తున్నారు. బంజర హిల్స్ జూబ్లీహిల్స్ లాంటి చోట ఇప్పటికీ ఐదు ఫ్లోర్లు మించి కట్టకూడదని నిబంధన ఉంది. మరి అదే నిబంధన సిటీ అంత ఎందుకు పెట్టరు. అలా చేస్తే నగరం ఇంకా పెరుగుతుంది. అవసరమైన చోటు తప్ప ఇలా 50?.60 ఫ్లోర్ల టవర్లు కంట్రోల్ చేయాల్సిందే. కేటీఆర్ సృష్టిం చిన జీవో 50 నీ రద్దు చేస్తేనే నగరం బాగుపడుతుంది. హైదరాబాద్ రోడ్లపై కారు నడపాలంటే చేతులు వణికిపోతున్నాయి.గంటలు గంటలు ట్రాఫిక్ లో మగ్గిపోతున్నారు జనం. దీంతో పొల్యూషన్ కూడా పెరిగిపోతుంది. ఇరుకు రోడ్లు? కిక్కిరిసిపోయిన వాహనాలతో సిటీలో నరకం చూస్తున్నారు. ఈ సమస్య పరిష్కారం కావాలంటే నగరం హరిజంటల్ గా పెరగాలి.50 ?.60 ఫ్లోర్లు టవర్లు కట్టుకొని జనం అంతా ఒకే చోట ఉండిపోతే బతుకులు నరకం అయిపోతాయి. వాటిని 20 ఫ్లోర్లకు గనుక కుదించి?. నగరాన్ని విస్తరిస్తే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి. ప్రజల జీవితాన్ని నిర్ణయించా ల్సింది రియల్ ఎస్టేట్ బిల్డర్లు కాదు? ప్రభుత్వాలు. రేవంత్ సర్కార్ ఆ దిశగా ఆలోచిస్తే ఇప్పటికైనా ఈ ఎఫ్ ఎస్ ఐ అరాచకాన్ని అడ్డుకో గలుగుతాం. 2014 నుంచి 2023 డిసెంబర్ వరకు హైదరాబాదులో నిర్మించిన హైరేజ్డ్ బిల్డింగ్ పర్మిషన్లపై సమగ్ర దర్యాప్తు ఆదేశిస్తే, అసలు అనుమతులు ఎందుకిచ్చారో ఎలా ఇచ్చారో మొత్తం వెలికి తీస్తే ఎఫ్ ఎస్ ఐ స్కాం మొత్తం బయటకు వస్తుంది. ఎఫ్ ఎస్ ఐ స్కాం వెనుక ఏ ఏ రియల్ ఎస్టేట్ సమస్యలు ఉన్నాయో? ఎవరెవరు అధికారులు ఉన్నారో? మంత్రులు ఎవరో బయటకు తీస్తే అసలు ఎన్ని వేల కోట్ల అక్రమాలు జరిగాయి? చివరికి హైదరాబాదును అవి ఎలా నరకం చేశాయో జనానికి తెలుస్తుంది.

# తమ్ముళ్ల వాయిస్ ఏది?



**విజయవాడ,తెలంగాణ దిశ:**లుగుదేశం పార్టీలో సీనియర్ నేతలు యాక్టివ్ గా లేని లోటు స్పష్టంగా కనిపిస్తుంది. అధికారంలో లేనప్పుడే నయం. అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తిన సీనియర్ నేతలు గతఎన్నికల్లో టిక్కెట్లు రాక కొందరు,మంత్రి పదవులు దక్కక మరి కొందరు మూగవో యారు. అందరూ జూనియర్ నేతలు కావడంతో ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలకు సరిగా కౌంటర్ ఇవ్వలేకపోతున్నారు. కొందరు తమకేం పట్టిందని వ్యవహరిస్తుండగా, మరికొందరు ఏం మాట్లాడితే ఏం జరుగుతందోనన్న భయంతో జూనియర్ నేతలు గళం విప్పడం లేదు. దీంతో టీడీపీ నేతల నుంచి గట్టి కౌంటర్ ఇవ్వడం లేదన్న విమర్శలు ఆపార్టీ క్యాడర్ నుంచే వినిపిస్తుండటం విశేషం. రాజకీయాల్లో అనుభవం చాలా ముఖ్యం. ఎవరికి ఏ రకమైన సమాధానం చెప్పాలన్న ది డక్కీమొక్కీలు తిన్న నేతలకు మాత్రమే తెలుస్తుంది. కొత్తగా తొలిసారి ఎన్నికయిన వారిలో కొందరు మినహాయించి మిగిలిన వారిలో పార్టీ తరుపున కౌంటర్ ఇవ్వాలన్న స్పృహ కూడా లేదని టీడీపీ సోషల్ మీడియాలో సొంత క్యాడర్ నుంచి విమర్శలువినిపిస్తున్నాయి. ఉండటానికి ఇరవై మందికిపైగా మంత్రులున్నప్పటికీ ఘాటుగా రిప్లై ఇచ్చేవారు ఒకరిద్దరు మినహాయించి ఎవరూ మాట్లాడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉదాహరణకు చిలకలూరిపేటమాజీ ఎమ్మెల్యే విడదల రజనీపై కేసు నమోదు చేసిన సంఘటనపై ఆమె అనేక ఆరోపణలు చేశారు. రెడ్ బుక్ రాజ్యాంగమని, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుపై కూడా విమర్శలు చేశారు కానీ టీడీపీ నుంచి ఒక్క మంత్రి కూడా దీనిపై స్పందించలేదు.

రజనీ చేసిన తప్పులను ఎండగట్టే ప్రయత్నం చేయలేదు. చివరకు ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు నేరుగా రంగంలోకి దిగి తాను కౌంటర్ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రత్తిపాటి పుల్లారావు స్పందించినప్పటికీ దానికి అంతగా ప్రాచుర్యం లభించలేదు. మంత్రులు ఇంత మంది ఉండి ఏం చేస్తున్నారన్న ప్రశ్నను తెలుగు తమ్ముళ్లు లేవనెత్తుతున్నారు. ఏసీబీ కేసు నమోదు చేయడంతో పాటు ఐపీఎస్ అధికారి చేసిన ఫిర్యాదు ఉన్నప్పటికీ ధీటుగా బదులివ్వలేని పరిస్థితి అమాత్యులకు ఎందుకు ఉందని నిలదీస్తున్నారు. ఇలాగే కొనసాగితే ప్రతిపక్ష విమర్శలను ప్రజలు నమ్మే అవకాశముందన్న హెచ్చరికలు కూడా వినిపిస్తున్నాయి... దీంతో పాటు వైసీపీ నేతలు సూపర్ సిక్స్ పై విపరీతమైన నెగిటివ్ ప్రచారాన్ని ప్రారంభించారు.

# స్వరూపానందకు రోజులు గడువు..!

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ:**విశాఖ శ్రీశారదా పీఠం వ్యవహారం ఎంతవరకు వచ్చింది? కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్వరూపానంద స్వామి కనిపించడం మానేశారా? స్వామి కబ్జాల వ్యవహారం బయటకు వస్తోందా? బయటకు రావడం కంటే సైలెంట్‌గా ఉండడమే బెటరని అంచనాకు వచ్చారా? మరి జీవీఎంసీ నోటీసులకు స్పందన లేకుంటే కూల్చివేతలు ఖాయమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ రూలింగ్‌లో రాజభోగం అనుభవించిన వారిలో శ్రీ శారదా పీఠం స్వరూపానంద స్వామి ఒకరు. భక్తుల మాట కాసేపు పక్కనబెడితే ఆయన ఆశీర్వాదం కోసం రాజకీయ నేతలు, అధికారులు తెగ తిరిగేవారు. అయినా స్వామి జగన్, కొందరు మంత్రులకు మాత్రమే కనిపించేవారు. ఆ తర్వాత ప్రత్యేకంగా కొందరితో మాత్రమే మాట్లాడేవారు.వైసీపీ పాలనలో వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను ఆక్రమించుకున్నారని స్వామిపై ఆరోపణలు లేకపోలేదు. దీనికితోడు స్వామికి ప్రత్యేకంగా భద్రత సైతం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు బాగా పరిపాలన చేస్తారంటూ రెండు ముక్కలు మాట్లాడారు. ధనుర్మాసం పూజలంటూ బయటకు వెళ్తానన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో సెటిలవుతానని చెప్పుకొచ్చారు.చివరకు స్వామి పత్తా లేకుండా పోయారు. ఇప్పుడు ఎక్కడ ఉన్నారో తెలీదు. స్వామి కోసం చాలామంది భక్తులు ఎదురు చూస్తున్నారు. స్వామి ఆశీర్వాదం తీసుకుంటే మంచి జరుగుతుందని కొందరు నమ్ముతారు. కూటమి వచ్చాక ఆయన భద్రతను పూర్తిగా తొలగించింది. ఇప్పుడు స్వామి కూడబెట్టిన ఆస్తులపై దృష్టిపెట్టింది.తాజాగా విశాఖ శ్రీ శారదా పీఠానికి గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ నోటీసులు ఇచ్చారు. రెవెన్యూ అధికారుల సర్వేలో 22 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్లు గుర్తించారు. అందులో శాశ్వత కట్టడాలు నిర్మించారు. వాటిని వారంలోగా తొలగించాలని నోటీసులో ప్రస్తావించారు అధికారులు. లేకుంటే తామే కూల్చివేస్తామని మఠం మేనేజర్‌కి వాటిని అందజేశారు.తొలగింపుకు అయ్యే ఖర్చు శారదాపీఠం నుంచే వసూలు చేస్తామన్నారు. చిన ముషిడివాడలో శ్రీశారదా పీఠం ఉంది. అందులో దాదాపు 22 సెంట్ల భూమి ప్రభుత్వ స్థలం ఉంది. అందులో 203 చదరపు గజాల స్వయం జ్యోతి మండపం ఉంది. 13 గజాల స్థలం సర్వే సంఖ్య 90లో ఉంది. మిగిలిన స్థలం సర్వే సంఖ్య 91/9లో వుడా లేఅవుట్‌కి సంబంధించిన ఓపెన్ స్పేస్‌లో ఉంది.

# నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి

**పెద్దపల్లి,తెలంగాణ దిశ:** సెర్ఫ్ క్రింద నిర్దేశించుకున్న లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీ శాఖ కార్యదర్శి డీ.ఎన్.లోకేష్ కుమార్ అన్నారు. గురువారం రాష్ట్ర పంచాయతీ శాఖ కార్యదర్శి డీ.ఎన్.లోకేష్ కుమార్ సెర్ఫ్ కార్యక్రమాల పై సెర్ఫ్ సీఈఓ డి.దివ్య తో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. రాష్ట్ర పంచాయతీ శాఖ కార్యదర్శి డీ.ఎన్.లోకేష్ కుమార్ మాట్లాడుతూ, యాసంగి మార్కెటింగ్ సీజన్ లో సెర్ఫ్ ద్వారా ఏర్పాటు చేయబోయే ఐకెపి కొనుగోలు కేంద్రాల సంఖ్య గణనీయంగా పెంచాలని రాష్ట్ర ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం 33% ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ సీజన్ నుంచి 50 శాతానికి పెంచేలా ప్రతిపాదన లు తయారు చేయాలని అన్నారు. జిల్లాలలో ఇతర శాఖల ద్వారా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలు చేయలేని పక్షంలో ఆ కేంద్రాలను ఐకెపి లకు బదిలీ చేయాలని, అదనపు వారిధాన్యందిగుబడి నేపథ్యంలో నూతన కేంద్రాల ఏర్పాటు సైతం స్వశక్తి మహిళా సంఘాలచే ప్రారంభించాలని కలెక్టర్ లకు తెలిపారు. ఐకెపి కొనుగోలు కేంద్రాలకు అవసరమైన తేమ శాతం యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ఇతర సామాగ్రి అందించాలని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల మహిళ సంఘాల సభ్యులకు అవసరమైన శిక్షణ అందిం చాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసినందుకు పౌ రసరఫరాల శాఖ నుంచి రావాల్సిన కమిషన్ మహిళా సంఘాలకు అందడం లేదని దీని పై జిల్లా స్థాయిలో కలెక్టర్లు సమీక్ష నిర్వహించి పెండింగ్ కమిషన్ చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలని, గన్ని బ్యాగులు రీకన్సిలేషన్ ప్రక్రియ చేపట్టాలని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో గోదాముల నిర్మాణానికి సంకల్పించారని, ప్రస్తుతం ఏ మండలాల్లో గోడౌన్లు లేవు గుర్తించి అక్కడ మహిళా సంఘాల ద్వారా గోడౌన్ నిర్మించేందుకు గల అవకాశా లను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. స్వశక్తి మహిళా సంఘాలచే రైస్ మిల్లుల ఏర్పాటు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. పౌర సరఫరాల శాఖ , సెర్ఫ్ సమన్వయంతో భారత ఆహార సంస్థకు బియ్యం సరఫరా చేసే దిశగా కార్యాచరణ తయారు చేసుకోవాలని అన్నారు. దివ్యాంగులకు యూ.డి.ఐ.డి కార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా రివ్యూ నిర్వహించి దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షల నిర్వహణ కోసం స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. నూతన దరఖాస్తులలో రీన్యూవల్స్ కు ప్రాధాన్యతగా షెడ్యూల్ చేయాలని అన్నారు. నిర్ధారణ క్యాంపు ల నిర్వహణ కోసం ఆసుపత్రిలో అవసరమై న సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ లకు సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. కుటుంబంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వృద్ధులు ఎవరైనా మరణిస్తే, వారి జీవిత భాగస్వామికి అర్హత ఉంటే వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని కలెక్టర్ లకు సూచించారు. డిఆర్డిఓ, ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించి ఇటువంటి కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.3 నెలలు ఫించన్ తీసుకొని లబ్దిదారుల వలస వెళ్లినట్లు షిష్టం నమోదు చేస్తుందని అన్నారు. ప్రస్తుతం మన దగ్గర 2 లక్షల 55 వేల 262 లబ్దిదారుల వలస వెళ్లినట్లు ఉందని, ఈ వివరాలను అధికారులు రివ్యూ చేసుకొని పెన్షన్ తీసుకోక పోవడానికి గల కారణాలు తెలుసుకోవాలని, లబ్ధిదారులు మరణిస్తే వివరాలను అప్ డేట్ చేయాలని అన్నారు.ప్రతి ప్రభుత్వ పాఠశాలను స్వశక్తి మహిళా సంఘాలతో ట్యాగింగ్ చేసి స్కూల్ యూనిఫాం కుట్టు ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని అన్నారు. స్కూల్ యూనిఫాం కుట్టు పనులకు సంబంధించి అవసరమైన కటింగ్ మిషన్, ఇతర పరికరాలు సిద్ధం చేసుకోవాల ని, మహిళా సంఘాల ద్వారా కుట్టు పనులు వేగవంతం అయ్యేలా చూడాలని , జూన్ నెల వరకు ఈ పనులు పూర్తి కావాలని అన్నారు. స్కూల్ యూనిఫామ్ కుట్టు పనులకు సంబంధించి కూలీ క్రింద 50 రూపాయలు మాత్రమే వచ్చినట్లు మహిళా సంఘాల సభ్యులు చెబుతున్నారని, దీనిని క్షేత్రస్థాయిలో కలెక్టర్లు రివ్యూ చేసి పెండింగ్ చెల్లింపులకు సంబంధించిన బిల్లులు సమర్పించేలా చూడాలని, ప్రభుత్వానికి సమర్పించిన ప్రతి బిల్లు చెల్లింపు పూర్తవుతుందని




అన్నారు. స్వశక్తి మహిళ సంఘాల ద్వారా సృష్టించబడిన స్విచ్చింగ్ సెంటర్ లు పూర్తి స్థాయిలో వినియో గించేలా ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలకు యూనిఫామ్ కుట్టిన తర్వాత ప్రైవేట్ గా కూడా కుట్టు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. బ్లౌజ్, పెటికోట్ కుట్టడం వంటి ఆర్డర్ తీసుకోవాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారని, ముందుగా జిల్లా స్థాయిలో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనువైన భూములు గుర్తించాలని అధికారులకు సూచించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, మండల కేంద్రాల స్థాయిలలో కూడా పెట్రోల్ బంకుల ఏర్పాటుకు కార్యాచరణ ఉంటుందని ఆయన అధికారుల కు తెలిపారు. మహిళల చేపట్టే పెట్రోల్ బంక్ లలో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్, పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం, క్యాంటీన్, చిన్న చిన్న హొటల్స్ ఏర్పాటు చేసేందుకు వీలుగా ఉండాలని అన్నారు. మహిళా శక్తి మాల్స్ ఏర్పాటు కూడా అవకాశాలు కల్పించాలని అన్నారు. గ్రామీణ సెల్ఫ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు కు అనువైన స్థలాల ఎంపిక చేయాలని,అనువైన స్థలం ఎంపిక చేసిన వెంటనే ఎన్.ఆర్.ఐ.టి నుంచి 50 లక్షల రూపాయల గ్రాంట్ వస్తుందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ కింద షాప్స్ ఏర్పాటుకు ప్రతి జిల్లాకు లక్ష్యాలు నిర్దేశించడం జరిగిందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి బజార్ లలో ప్రజలకు అవసరమైన సామాగ్రి అందుబాటులో ఉండాలని, బజార్ ఎల్లప్పుడూ ప్రజలతో కిటకిటలాడేలా ఏర్పాటు చేయాలని అన్నారు.జిల్లాలలో వివిధ సమయాలలో నిర్వహించిన తనిఖీలలో అవకతవకలు గమనించి లైసెన్స్ రద్దు చేసిన పెట్రోల్ బంక్ లను


మహిళా సంఘాలకు కేటాయించాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు 10 లక్షల ప్రమాద బీమా, 2 లక్షల సాధారణ బీమా పథకం ప్రభుత్వం అమలు చేస్తుందని, మరణించిన మహిళా సంఘాల సభ్యుల సరైన డాక్యుమెంట్ లను పరిశీలించి సరైన లబ్ధిదారులకు ఈ సహాయం అందేలా చూడాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా రివ్యూ నిర్వహించి జిల్లాలో ఎంతమంది మహిళా సంఘాల సభ్యులు మరణించారు, పరిశీలించి సంబంధిత లబ్ధిదారులకు సహాయం అం దజేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లాలో సుల్తానాబా ద్, మంథని రహదారి వద్ద మహిళా సంఘాలచే పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నామని, త్వరలోనే స్థల ఎంపిక చేసి సంబంధిత ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పిం చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆర్ సెటి ట్రైనింగ్ సెంటర్ త్వరగా ఏర్పాటు చేయాలని,లోన్ బీమా,ప్రమాద బీమా క్లెయిమ్స్ తొందరగా పంపించాలని తెలిపారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ ఎం. కాళిందిని, అడిషనల్ డి ఆర్ డి ఓ రవికుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆ రోజు అవకాశం రాదనుకున్నా..!




సినీ ఇండస్ట్రీలో ప్రస్తుతం ఎక్కువగా వినిపిస్తున్న పేరు కయాదు లోహర్. ప్రదీప్ రంగనాథన్ హీరోగా వచ్చిన 'డ్రాగన్' చిత్రంతో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. చిత్ర పరిశ్రమలోకి 2021లోనే ఎంట్రీ ఇచ్చినా.. ఈ తమిళంలో తొలిసారిగా నటించిన చిత్రమే కయాదుకు మంచి గుర్తింపును తీసుకువచ్చింది. ప్రస్తుతం తమిళంలోనే అథర్వ సరసన నటిస్తున్నది. ఈ క్రమంలో ఇంటర్వ్యూలో కయాదు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాను దిగువ మధ్య తరగతి కుటుంబానికి చెందిన అమ్మాయి నని.. అందరూ కలలను సాకారం చేసుకోవడం కష్టమని చెప్పింది. తాను రాణించి.. లక్ష్యాన్ని సాధించాలని కలలు కంటున్న అమ్మాయిలకు మార్గం సుగమం చేయాలని అనుకుంటున్నానని చెప్పింది. డ్రాగన్‌కు ముందు కయాదు అంటే ఎక్కువ మందికి తెలియదని.. ప్రస్తుతం సినిమాలోని తన పాత్రను ఇష్టపడుతున్నారని.. ఇప్పటికీ తనను కయాదు లోహర్‌గానే గుర్తిస్తారని చెప్పింది. ఇది సాధించడం చాలా కష్టమని.. ఈ ప్రేమను పొందడం తన అదృష్టమని తెలిపింది. దర్శకులు, నిర్మాతలు నాలోని ప్రతిభను గుర్తిస్తున్నారని.. తాను ఎప్పుడు కలలు కనే ప్రాజెక్టులు వస్తున్నాయని చెప్పుకొచ్చింది. కాలేజీలో చదువుతున్న సమయంలో టైమ్ ఫ్రెష్ ఫేస్ సీజన్-12లో పాల్గొనాలని తల్లి సూచించిందని.. వేసవి సెలవుల సీజన్ కావడంతో పాల్గొని గెలిచా నని చెప్పింది. అప్పుడే ఓ కాస్టింగ్ డైరెక్టర్ యాడ్ కోసం తనను సంప్రదించాడని.. ఆ తర్వాత తొలిసారిగా కన్నడంలో ముగిల్‌పేటలో హీరోయిన్‌గా నటించే ఛాన్స్ వచ్చిందని పేర్కొంది. తనకు ఐదారు సంవత్సరాల వయసు ఉన్న సమయంలో వేదికపై చయ్య చయ్య సాంగ్‌కి వేదికపై డ్యాన్స్ చేశానని.. తనకు ఆ సమయంలో కలిగిన ఆనందం ఇప్పటికీ గుర్తుంది అని వివరించింది. మాధురి దీక్షిత్, శ్రీదేవిని అనుకరించే దాన్ని అని చెప్పింది. డ్రాగన్ మూవీలో పల్లవి పాత్ర తనకు మంచి పాత్ర అవుతుందని అశ్వత్ (మారిముత్తు) చెప్పారని మొదట ఈ పాత్ర కీర్తి (అనుపమ పోషించిన పాత్ర) కోసం తనను సంప్ర దించి కథ చెప్పారని.. ఆ తర్వాత నెల రోజుల వరకు తిరిగి ఏం సమాచారం ఇవ్వకపోవడంతో తాను ప్రాజెక్టులో పని చేసే అవకాశం రాదని భావించానని చెప్పింది. ఆ తర్వాత డైరెక్టర్ పల్లవి పాత్ర ఇచ్చారని.. డ్రాగన్ మూవీలో పోషించిన ఈ పాత్రకు ఈ స్థాయిలో పేరు వస్తుందని తాను ఊహించలేదనని చెప్పుకొచ్చింది. తాను ఉద్దేశపూర్వకంగా ఇతర భాషా చిత్రాల్లో పని చేయలేదని.. సహజంగానే జరిగిందని తెలిపింది. తమిళం, మలయా ళం, తెలుగు, కన్నడ, మరాఠీ చిత్రాల్లో పని చేయడం చాలాబాగుం దని, ప్రతి భాషకు సొంత శైలి, నైపుణ్యాలు ఉన్నాయని చెప్పింది. మలయాళం నేర్చుకోవడం అత్యంత కష్టమని.. ఆ తర్వాత తమిళం, తమిళం, తెలుగు కూడా ఇబ్బందేనని తెలిపింది. ఇదిలా ఉ ండగా.. కయాదు లోహర్ తొలిసారిగా 2021లో కన్నడ చిత్రం 'ముగిల్‌పేట' మూవీతో ఇండస్ట్రీలోకి వచ్చింది. ఆ తర్వాత మళయాలంలో 'పాథోన్‌పథం నూట్టుండు' చిత్రంలో నటించింది. ఆ తర్వాత శ్రీ విష్ణు సరసన 'అల్లూరి' చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. మరాఠీలో ఐ ప్రేమ్ యూలో కనిపించింది. ఇక ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైన 'డ్రాగన్' మూవీతో కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం తమిళంలోనే 'ఇదయం మురళీ' మూవీలో అథర్వ సరసన నటిస్తు న్నది. అలాగే, మరికొన్ని ప్రాజెక్టులపై చర్చిస్తున్నట్లు తెలుస్తున్నది.

# రష్మిక పట్టిందల్లా బంగారం



అగ్ర కథానాయిక రష్మిక మందన్న పట్టిందల్లా బంగారమవుతున్నది. ఇటీవలకాలంలో ఈ కన్నడ కస్తూరి నటించిన సినిమాలన్నీ ఐదొందల కోట్ల వసూళ్ల మైలురాయిని దాటడం విశేషం. యానిమల్, పుష్ప-2, ఛావా చిత్రాలు బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టాయి. దాంతో అభిమానులు మోస్ట్ లక్కీయెస్ట్ హీరోయిన్ ఇన్ ఇండియన్ సినిమా అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ఈ భామ ఆస్తుల గురించి ఫోర్బ్స్ సంస్థ ఆసక్తికరమైన విషయాలను బయటపెట్టింది. ఇప్పటికే రష్మిక మందన్న 70కోట్ల వరకు ఆస్తులను సంపాదించిం దని, త్వరలో అది 100కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. హైదరాబాద్‌తో పాటు ముంబయి, బెంగళూరు, గోవా, కూర్గ్‌లో రష్మిక మందన్నకు సొంత నివాస భవనాలున్నాయి. వీటి విలువ వందకోట్లకుపైనే ఉ ంటుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దక్షిణాదితో పాటు హిందీలో వరుస సక్సెస్‌లతో రష్మిక మందన్న రెమ్యునరేషన్‌ను భారీగా పెంచిందని, ఒక్కో సినిమాకు పది కోట్ల వరకు ఛార్జ్ చేస్తుందని చెబుతున్నా రు. దక్షిణాది కథానాయికల్లో సంపాదనపరంగా ఆమె నెంబర్‌వన్ అని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.

# అనంతలో అద్భుతం!

**అనంతపురం,తెలంగాణ దిశ:** గ్రామాల్లో తరచుగా వింతలు జరుగుతుంటా యి. కలలోకిదేవతలు వచ్చారని, ఫలానా పని చేయాలని కొందరు చెప్తూ ఉంటారు.కొన్నిసార్లు వాళ్లు చెప్పినట్లు చేస్తే ఆశ్చర్యకర విషయాలు వెలుగు లోకి వస్తాయి. తాజాగా ఏపీలో ఇలాంటి ఘటనే జరిగింది. ఓ యువకుడి కలలోకి అమ్మవారు వచ్చి.. ఫలానా చోట తవ్వితే తన విగ్రహం బయటపడుతుందని చెప్పిందట. గ్రామస్తులంతా కలిసి అమ్మవారు చెప్పిన చోటుకు వెళ్లి గునపాలతో తవ్వారు. ఆశ్చర్యకరంగా అమ్మవారి విగ్రహం బయటపడింది. దీంతో గ్రామస్తులంతా ఆ విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేయడం మొదలు పెట్టారు. ఇంతకీ అసలు ఏం జరిగిందటే..అనంతపురా నికి చెందిన అంజి అనే యువకుడు గత కొద్ది రోజులుగా అమ్మవారు ఒంటి మీదికి వచ్చిందంటూ పూనకంతో ఊగిపోతున్నాడు. అంతేకాదు, గంగమ్మ అమ్మవారు తన కలలోకి వచ్చిందని చెప్పాడు.

గౌరవ గార్డెన్ వాటర్ ట్యాంక్ సమీపంలో తవ్వితే విగ్రహాలు బ యటపడతాయని చెప్పిందంటూ శిగం ఊగాడు. రెండు అడుగుల లోతుతో ఆ విగ్రహాలు ఉన్నాయని అమ్మవారు తనకు చెప్పిందని చుట్టుపక్కల వారితో చెప్పాడు. అతడి మాటలు నమ్మిన స్థానికులు వాటర్ ట్యాంక్ సమీపంలో తవ్వకాలు చేపట్టాలి అనుకున్నారు.తాజాగా స్థానికుల అంతా కలిసి పూజలు చేసి అంజి చెప్పిన ప్రాంతంలో పూజలు చేసి, విగ్రహాల కోసం తవ్వకాలు మొదలుపెట్టారు. చెప్పినట్లుగానే రెండు అడుగులు తవ్వగానే గంగమ్మ అమ్మవారి విగ్రహం బయటపడింది. స్థానికులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యారు. అందరూ కలిసి అమ్మవారి విగ్రహాన్ని నీటితో కడిగి, పసుపు, కుంకుమ రాశారు. పూలు, నిమ్మకాయలు పెట్టి పూజలు చేస్తున్నారు.ఈ విషయం అనంతపురం అంతా వ్యాపించడంతో అమ్మవారిని చూసేందుకు ప్రజలు తరలి వస్తున్నారు. అమ్మవారిని చూసి విగ్రహం మీద పసుపు, కుంకుమ వేసి పూజలు చేస్తున్నారు.


# తెరపైకి భార్యబాధితుడు..?

బెంగళూరు: చెన్నై టెక్ బిలియనీర్ ఇంటి వ్యవహారం రచ్చకెక్కింది. లక్ష కోట్ల కంపెనీలకు అధిపతి అయిన ప్రసన్న శంకర్ భార్య బాధితుడు అయ్యాడు. ఆయన వ్యక్తిగత జీవితం హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ హెచ్‌ఆర్ టెక్ స్టార్టప్ 'రిప్లింగ్' సహ వ్యవస్థాపకుడు, అనేక స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన ప్రసన్న శంకర్ నారాయణ ప్రస్తుతం తన భార్య దివ్య శశిధర్ తో విడాకుల వివాదంలో చిక్కుకున్నారు. పోలీసులు అరెస్ట్ చేస్తారేమోనని భయపడి ప్రస్తుతం తాను పరారీలో ఉన్నానని ప్రసన్న శంకర్ నారాయణ స్వయంగా సోషల్ మీడియాలో పోస్టు చేశారు.. దీంతో ఇది దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో పోలీసులు ఈ విషయంపై స్పందించారు.. తాము అరెస్టు చేయమని చెప్పడంతో ఈ వివాదానికి కాస్త బ్రేక్ పడినట్లయింది.. ఈ క్రమంలో ప్రసన్న శంకర్ పో లీసులపై కూడా పలు ఆరోపణలు ఒశారు. హెచ్‌ఆర్ టెక్ స్టార్టప్ 'రిప్లింగ్' సహ వ్యవస్థాపకుడు, అనేక స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడిదారుడిగా ప్రసన్న శంకర్ నారాయణ వ్యవహరిస్తున్నారు. ప్రసన్న శంకర్ నారాయణ, దివ్య దంపతులు.. వారికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలం గా వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో అమెరికా కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలైంది. దివ్య, అమె కుమారుడు అమెరికా పౌరులు. ఈ నేపథ్యంలో, భరణంగా నెలకు తొమ్మిది కోట్ల రూపాయలు చెల్లించాలని దివ్య డిమాండ్ చేయగా, దీనిపై చర్చలు జరుగుతున్నాయి. టెక్ వ్యవస్థాపకుడు ప్రసన్న శంకర్ సోషల్ మీడియాలో సంచలన ఆరోపణలు చేశారు. తన నుండి విడిపోయిన భార్య, చెన్నై పోలీసులు తనను వేధిస్తున్నారని ఆరోపించారు. తిరుచ్చిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి పట్టభద్రుడయిన శంకర్, సింగపూర్‌కు చెందిన క్రిప్టో సోషల్ నెట్‌వర్క్ వ్యవస్థాపకుడు. తన భార్యకు వివాహేతర సంబంధం ఉందని తెలుసుకున్న తర్వాత తనకు కష్టాలు ఎదురయ్యాయని ఆరోపించాడు. తన భార్య ద్రోహానికి ఆధారాలు దొరికిన తర్వాత, ఆమె విడాకుల కోసం భారీగా పరిహారాన్ని కోరిందని శంకర్ పేర్కొన్నాడు. చర్చలు నిలిచిపోయినప్పుడు, ఆమె తనపై గృహ హింస ఆరోపణలు చేస్తూ తప్పుడు పోలీసు ఫిర్యాదు దాఖలు చేసిందని ఆరోపించాడు. భారతదేశంలో కాకుండా అమెరికాలో విడాకుల కోసం దాఖలు చేయడం ద్వారా ఆమె ప్రయోజనం పొందడానికి ప్రయత్నించిందని, ఎందుకంటే భారతదేశంలో తాను విడాకులకు దరఖాస్తు చేసుకున్నానని కూడా అతను చెప్పాడు. ప్రసన్న శంకర్ నారాయణ, దివ్య దంపతులు. వారికి తొమ్మిదేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో అమెరికా కోర్టులో విడాకుల పిటిషన్ దాఖలైంది. దివ్య, ఆమె కుమారుడు అమెరికా పౌరులు. ఒప్పందంలోని నిబంధనల ప్రకారం, అతను తన భార్యకు సుమారు రూ.9 కోట్ల రూపాయలు, అలాగే నెలకు రూ.4.3 ల క్షలు చెల్లించాల్సి ఉంది, అదే సమయంలో వారి కొడుకు ఇద్దరి కస్టడీలో ఉండాలి. తన భార్య దివ్యకు వివాహేతర సంబంధం ఉందని, ఈ విష యమై గొడవలు జరిగాయని అంటు న్నాడు ప్రసన్న. తన కుమారుడిని కిడ్నాప్ చేసినట్టు దివ్య ఫిర్యాదు చేసిందని, అంతర్జాతీయ పిల్లల అక్రమ రవాణాకు సంబంధించిన సెక్షన్లతో కేసు నమోదైందని తెలిపాడు. అమెరికా




పోలీసులు, కోర్టు ఈ ఆరోపణలను విచారించి,అవి నిరాధారమైనవని త ల్చితనకు అనుకూలంగా తీర్పునిచ్చా యన్నాడు. ఆతర్వాత కూడా నేను దాడిచేసి అత్యాచారం చేసినట్టు, నగ్న వీడియోలు సర్క్యులేట్ చేస్తున్నట్టు దివతనపై సింగపూర్‌లో ఫిర్యాదు చేయగా, సింగపూర్ పోలీసులు తనకుక్లీన్ చిట్ ఇచ్చారని తెలిపాడు.అమెరికా కోర్టు ప్రసన్నకు ప్రతి వా రాంతంలో కుమారుడితో గడిపేందుకు అనుమతినిచ్చింది. వారం క్రితం దివ్య తన కుమారుడితో అమెరికా నుంచి చెన్నైకి వచ్చింది.

# చెలరేగిపోతున్న అనుచర గణాలు..!



స్టాండప్ కమేడియన్ కునాల్ కమ్రా లక్ష్యంగా మహారాష్ట్రలోని పాలక పక్షం, దాని అనుచర గణాలు చెలరేగిపోతున్న తీరు దారుణం. ఏక్‌నాథ్ షిండేపై కునాల్ కమ్రా చేసిన వ్యంగ్య వ్యాఖ్యను ఏ మాత్రం సహించలేని అధికారంలో ఉన్న ఎన్‌డిఎ కూటమి హింసాత్మక చర్యలకు దిగింది. ఆయన ప్రదర్శన చేసిన హేబిటేట్ స్టూడియోపై పాలక కూటమి గూండాలు ఒకవైపు దాడి చేయగా, మరోవైపు మున్సిపల్ అధికారులు స్టూడియోలోని పలు భాగాలను కూల్చివేశారు. కమ్రాను అడ్డగించడం, బెదిరించడంతో పాటు ఆయనపై అనేక కేసులను పోలీసులు నమోదు చేశారు. విమర్శను సహించలేని కూటమి ప్రభుత్వం ఒక వ్యక్తిని లక్ష్యంగా చేసుకుని చేపట్టిన ఈ బరితెగింపు చర్యలు నిస్సందేహంగా కక్ష సాధింపు మాత్రమే గాక, భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాయడమే! ప్రజాస్వామ్య ంలో విమర్శకు ఎంతో ప్రాధాన్యత ఉందంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తనదైన శైలిలో సూక్తిముక్తావళి పఠించిన కొద్ది రోజుల్లోనే ఆయన నేతృత్వంలోని కూటమి పాలించే రాష్ట్రంలోనే ఈ సంఘటన చోటు చేసుకోవడం మాటలకు, చేతలకు పొంతన లేని తనానికి నిదర్శనం. బిజెపి, ఎన్‌డిఎ కూటమి పాలనలోని రాష్ట్రాల్లో ఒక దాని తరువాత ఒకటిగా చోటుచేసుకుంటున్న ఈ తరహా పరిణామాలు అక్కడి ప్రభుత్వాలు మూకహింసనే చట్టంగా మార్చుకుంటూ ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్న తీరుకు తార్కాణాలు పెద్దగా పేరులేని ఒక రాజకీయ నాయకుడి ఎదుగుదలను వివరిస్తూ సాగిన హిందీసినిమా పాటను తన ప్రదర్శనలో అనుకరించిన కునాల్ గద్దార్ (ద్రోహి) అనే పదాన్ని ఉపయోగించారు. దీనిని ఏమాత్రం సహించలేని అక్కడి పాలకపక్షం, తన అధికారాన్ని ఉపయోగించడంతో పాటు, గూండాలను ఆయనపైకి ఉసిగొల్పుతోంది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ శాసనసభ వేదికగా భావవ్యక్తీకరణ స్వేచ్ఛపై దాడి చేశారు. ఆయన సమక్షంలోనే శివసేన ఎంఎల్‌ఏ ముర్జి పటేల్ రెండు రోజుల్లో క్షమాపణ చెప్పకపోతే కునాల్ కమ్రాను వీధుల్లోకి తిరగనిచ్చేది లేదని హెచ్చరించారు. ఆ వెంటనే వరుస సంఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం. ముంబయి పోలీసులు కమ్రాపై భారతీయ న్యాయ సంహిత కింద ప్రజలకు హాని కలిగించడం, వారి మధ్య శత్రుత్వాన్ని రగిలించడం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కమ్రా చేసిన వ్యాఖ్యకు ప్రజలకు హాని కలిగించడం ఏమిటో అర్థం కాదు. పరువు నష్టం సెక్షన్ల కింద కూడా ముంబయి పోలీసులు కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. వ్యక్తిగత హోదాలో వ్యక్తులు మాత్రమే పెట్టవలసిన ఈ కేసును పోలీసులుఎలా నమోదు చేస్తారన్న ప్రశ్నకు వారి వద్ద నుండి సమాధా నం లేదు. ఈ కేసుల తతంగం ఒకవైపు నడుస్తుండగానే మరోవైపు గూండాల గుంపు ఒకటి కమ్రా ప్రదర్శన ఇచ్చిన హేబిటేట్ వేదికపై విరుచుకుపడి ధ్వంసం చేసింది. ఈ విధ్వంసకాండ జరుగుతుండగానే రంగ ప్రవేశం చేసిన బృహత్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ తన వంతు విధ్వంసాన్ని పూర్తి చేసింది. ఆ వేదికకు సంబంధించిన కట్టడంలో మిగిలిన అక్రమాలను కూడా వెలికి తీసి కూల్చివేస్తామని ప్రకటి ంచింది. రాజకీయల్లో ఈ తరహా విమర్శ కొత్త కాదు. పార్టీ ఫిరాయింపు సంఘటనల్లో ఇటువంటి మాటలు వినపడుతుంటాయి. ఇప్పుడు షిండే కొమ్ము కాస్తున్న నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నేత అజిత్ పవార్ సైతం తన ప్రత్యర్థులనుద్దేశించి గతంలో ఈ ద్రోహ పదాన్ని ఉపయోగించిన విషయాన్ని పరిశీలకులు ప్రస్తావిస్తున్నా రు.

ఇక రాజకీయాలపై జరిగే కళాత్మక ప్రదర్శనల్లో వ్యంగ్యం చోటుచేసుకోవడం అసాధారణమేమీ కాదు. ఇటువంటి కారణాల చేతనే బహిరంగ క్షమాపణ చెప్పాలన్న మహారాష్ట్ర ప్రభుత్వ డిమాండ్‌ను కునాల్ కమ్రా తిరస్కరించారు. అదే సమయంలో చట్టబద్ధమైన దర్యాప్తునకు సహకరిస్తానని, కోర్టులు ఆదేశిస్తే క్షమాపణ చెబుతానని ఆయన ప్రకటించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఏకపక్ష, కక్ష సాధింపు చర్యలు మానుకొని, కమ్రాపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలి. అప్పటి వరకు కమ్రాకు బాసటగా నిలవడం ద్వారా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత! అక్రమ కేసులు, దాడులు, నిర్బంధంతో కళాకారుల గొంతు నొక్కడం అసాధ్యమన్న విషయాన్ని ఎన్‌డిఎ నేతలు గమనించాలి.





# అందుకే జాన్వీ కపూర్, అనన్య పాండేతో నటించాలని ఉంది..!

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ నటిస్తున్న చిత్రం 'సికందర్'. ఈ మూవీ ఈ నెల 30న విడుదల కానున్నది. మూవీ ప్రమోషన్స్‌లో సల్మాన్ పాల్గొంటున్నాడు. ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. యువ హీరోయిన్లు జాన్వీ కపూర్, అనన్య పాండేతో కలిసి పని చేయాలని కోరుకుంటున్నానని తెలిపాడు. అయితే, వయసు వ్యత్యాసం కారణంగా అందరూ తనను విమర్శించే ఛాన్స్ ఉందని వ్యాఖ్యానించారు. ఓ కార్యక్రమంలో సల్మాన్ మాట్లాడుతూ యువ హీరోయిన్లతో కలిసి పని చేసేది వారికి పెద్ద వేదిక, అవకాశాలు ఇవ్వడానికి మాత్రమేనన్నారు. తాను అనన్య, జాన్వీతో కలిసి పని చేయాలనుకుంటే తనను జనం ఇబ్బందిపడుతారని.. వయసు వ్యత్యాసం గురించి మాట్లాడుతారని.. అయినా వారితో కలిసి పని చేస్తానని చెప్పాడు. గతంలో చాలామంది నటులతో కలిసి ఏదైనా చేయాలని ఓ నిర్మాతకు సూచించాననని.. కానీ, ప్రస్తుత జనరేషన్ ఒకరితో ఒకరు కలిసి పని చేసేందుకు నిరాకరించినట్లు చెప్పాడు. మల్టీస్టారర్ సినిమాలు చేయడం సౌకర్యవంతంగా ఉంటుందని.. ఎందుకంటే అభిమానలంతా కలిసి వచ్చి సినిమాను హిట్ చేసినట్లుగా ఉ ంటుందన్నారు. తాము 100-200 రోజులు పని చేసిన సందర్భాలు ఉ న్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ నటిస్తున్న సికిందర్ మూవీని పెన్ స్టూడియో బ్యానర్‌పై సాజిత్ నదియవాలా నిర్మిస్తున్నారు. రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తుండగా.. కాజల్ అగర్వాల్ కీలకపాత్రలో కనిపించనున్నది. ఏఆర్ మురుగదాస్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. అయితే, గత కొద్దిరోజుల ఈ మూవీలో రష్మికకు సల్మాన్ తండ్రిలా ఉ న్నాడని, ఇద్దరి మధ్య 31 సంవత్సరాల ఏజ్ గ్యాప్ ఉందని పలువురు సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు. ఇటీవల జరిగిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ట్రోల్స్‌పై సల్మాన్ స్పందించాడు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215